
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
ఆదివారం 7 జూలై 2024

'నెల్లూరు నగర కార్పొరేషన్(ఎన్ఎంసీ) కమిషనర్ నేను చెప్పినట్టే వింటాడు... నీ సస్పెన్షన్ ఎత్తేయించే బాధ్యత నాది....! రూ. లక్ష ఇవ్వు.. అంతా నేను చేసుకుంటా... మీపై త్వరలో ఎఫ్ఐఆర్ నమోదు కాబోతోంది. ఫైల్ రెడీ చేశారు. నా సంగతేంటో చూసుకోండి'... అంటూ కార్పొరేషన్‌లోని ఓ సీనియర్ సహాయకుడు వసూల్‌రాజా అవతార మెత్తారు. తాజాగా వెలుగు చూసిన కమిషనర్ సంతకాల ఫోర్జరీ స్కాంను అడ్డంపెట్టుకుని అందినకాడికి దండుకుంటున్నాడు. ఇలా ఇటీవల సస్పెన్షన్ గురైన ఇద్దరు చిరుద్యోగుల వద్ద రూ. లక్ష చొప్పున వసూలు చేశారు. కాగా స్కాంలో ప్రమేయం ఉన్నట్లు అనుమానిస్తున్న లైసెన్స్ ఇంజనీర్ల వద్ద నుంచి కూడా నగదు వసూలు చేసినట్లు సమాచారం.

- నెల్లూరు(సిటీ)

రూ.లక్ష ఇస్తే

సస్పెన్షన్ ఎత్తేయిస్తా..!

- కార్పొరేషన్ ఫోర్జరీ స్కాంలో కొత్తకోణం
- ఎన్ఎంసీలో సీనియర్ సహాయకుడి బాగోతం
- చెప్పినట్టు కమిషనర్ వింటాడని అందినకాడికి వసూళ్లు



రాష్ట్రంలో పురపాలక శాఖను విస్మయానికి గురిచేసిన నెల్లూరులోని సంతకాల ఫోర్జరీ కుంభకోణం కార్పొరేషన్‌లోని ఓ సీనియర్ సహాయకుడికి ఆర్థిక వనరుగా మారింది. ఈ స్కాంలో ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సిటీ ప్లానింగ్ అధికారులు ఇద్దరు, సచివాలయ ఉద్యోగులు మరో ఇద్దరిని కమిషనర్ వికాస్‌మర్మత్ ఇటీవల సస్పెండ్ చేశారు. వెంటనే రంగంలోకి దిగిన సీనియర్ సహాయకుడు మీ సస్పెన్షన్ నేను ఎత్తేయిస్తా... నాకు రూ. లక్ష చొప్పున ఇవ్వడంటూ వసూళ్లు చేసినట్లు ఆరోపణలు గుప్పుమంటు న్నాయి. ఇదే సమయంలో స్కాంకు సంబంధం ఉన్నట్లు లైసెన్సు ఇంజనీర్లను వివరణ కోరుతూ కమిషనర్ నోటీసులు జారీ చేశారు. వారితోనూ టచ్‌లోకి వెళ్లిన ప్రబుద్ధుడు తనకు సొమ్ము ముట్టుచెబితే కార్పొరేషన్‌లో తాజాగా సిద్ధమవుతున్న ఎఫ్ఐఆర్‌లో మీ పేర్లు లేకుండా చేస్తానంటూ వారిని నమ్మబలుకుతున్నాడు.

● ఇంక్రిమెంట్ల పునరుద్ధరణకు రూ. 70వేలు

గతంలో అలీంబాషా కమిషనర్‌గా ఉన్న సమయంలో ఆర్థిక అవకతవకలకు పాల్పడిన ఓ మహిలా ఉద్యోగిని సస్పెండ్ చేశారు. దీంతో ఆమెకు అందాల్సిన ఇంక్రిమెట్లు నిలిచిపోయాయి. వాటిని పునరుద్ధరణ చేయిస్తానని ఆమె నుంచి రూ. 70 వేలు వసూలు చేసినట్లు తాజాగా ఆరోపణలు గుప్పుమంటున్నాయి. దాదాపుగా ఐదేళ్ల పాటు ఆమెను తనచుట్టూ తిప్పించుకుంటున్నట్లు సమాచారం. కార్పొరేషన్‌లోని ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఓ వ్యక్తికి డివిజన్లలో ఫిట్టర్ పోస్టు ఇప్పిస్తానని రూ. 50 వేలు వసూలు చేసినట్లు తెలిసింది.

● గత అనుభవం దృష్ట్యా...

కార్పొరేషన్‌లోని ఎస్టాబ్లిష్‌మెంట్‌లో పనిచేసే ఈ ఉద్యోగి కొన్నేళ్ల క్రితం కమిషనర్ పేషీలో సీసీగా పనిచేశాడు. దీంతో కమిషనర్‌తో అతనికి మంచి సంబంధాలున్నట్లుగా అందరూ నమ్ముతారు. అదే అతని పెట్టుబడిగా దందా కొనసాగిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇతడిపై విచారణ చేపడితే మరిన్ని విషయాలు వెలుగులోకి రానున్నాయని ఉద్యోగులు అంటున్నారు.



ఫోర్జరీ సంతకాలపై కేసు
● ఎస్పీని కోరిన నగర కమిషనర్

ఎన్ఎంసీని కుదిపేస్తున్న ఫోర్జరీ సంతకాల కుంభకోణం పై కేసు నమోదు చేసి, దోషులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్‌ను కోరారు. శుక్రవారం ఆయన లేఖ రాయగా, శనివారం వెలుగులోకి వచ్చింది. ఫోర్జరీ సంతకాల వ్యవహారంలో తన వద్దనున్న సమాచారాన్ని ఐదు పేజీల లేఖలో సవివరంగా ప్రస్తావించిన కమిషనర్, ఇప్పటి వరకు తన పరిధిలో తీసుకున్న శాఖపరమైన చర్యలను అందులో వివరించారు. ఈ వ్యవహారంపై నిగ్గు తేల్చేందుకు విజిలెన్స్ విచారణను కూడా కోరినట్లు తెలిసింది.

● మేయర్ భర్త ప్రమేయం !

ఈ కుంభకోణంలో మేయర్ పొట్లూరి స్రవంతి భర్త జయవర్ధన్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. సిటీ ప్లానింగ్ విభాగంలో టీపీవోలుగా ఉన్న బీ ప్రవీణ్, ఎం దేవేంద్రతోపాటు సచివాలయంలో ప్లానింగ్ సెక్రటరీలుగా ఉన్న పీ నాగేంద్రబాబు, కే కార్తీక్‌మాలవ్యను ఇప్పటికే సస్పెండ్ చేశారు. వీరితో స్కాం చేయించడంలో మేయర్ భర్త జయవర్ధన్, అతడి సహాయకుడు శివకృష్ణ పాత్ర కీలకమంటూ న్యాయవాది కాకు మురళీ నుంచి తనకు ఫిర్యాదు అందిందని కమిషనర్ ఆ లేఖలో పేర్కొన్నాడు.

● వైసీపీ వర్గాల్లో వణుకు

రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం కొలువు తీరిన వెంటనే ఈ కుంభకోణం బహిర్గతం కావడంతో రాజకీయ వర్గాల్లో తీవ్ర ప్రకంపనలు రేపుతోంది. ఈ స్కాంలో ఇప్పటికే మేయర్ భర్త జయవర్ధన్ ఆరోపణలు ఎదుర్కొంటుండగా, ఆయనతో పాటు మరో నలుగురు కార్పొరేటర్ల ప్రమేయం ఉన్నట్లు చర్చ నడుస్తోంది. సహకార సంస్థకు చెందిన చైర్మన్ పేరు కూడాఆ ఈ స్కాంలో ప్రధానంగా వినిపిస్తోంది. అటు విజిలెన్స్, ఇటు పోలీసులు దర్యాప్తు చేయాలని అధికారికంగా లేఖలు అందడంతో వైసీపీ వర్గాల్లో వణుకు ప్రారంభమైంది.

లేఅవుట్లలో అక్రమాలపై చర్యలు

● నుడా వీసీ బాపిరెడ్డి ● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏర్పాటైన లేఅవుట్లలో అక్రమాలపై చర్యలు తీసుకుంటామని నుడా వీసీ బాపిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి ఆయన స్పందిస్తూ పొదలకూరులో ఫోర్జరీ డాక్యు మెంట్లతో లేఅవుట్లు వేసినట్లు తమ దృష్టికి రావడంతో సిబ్బం దితో వెళ్లి తనిఖీ చేసి నిర్ధారించు కున్న తరువాతే పోలీసు కేసు నమోదు చేశామన్నారు. తమ దృష్టికి ఫిర్యాదులు వచ్చిన వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న లేఅవుట్లపై తనిఖీలకు ప్రభుత్వం ప్రత్యేక త్రీమన్ కమిటీ ఏర్పాటు చేసిందని ఆయన వివరించారు.

● నకిలీ పత్రాల సృష్టికర్తలపై కేసు నమోదు

పొదలకూరు : పట్టణంలోని నెల్లూరు ప్రధాన రోడ్డు పక్కన నకిలీపత్రాలు సృష్టించి లేఅవుట్ వేసిన యజమానులపై నుడా వైస్‌ఛైర్మన్ బాపిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ డీ రామకృష్ణారెడ్డి శనివారం కేసు నమోదు చేశారు. క్రైం నెంబరు 74/24 అండర్ సెక్షన్ 468, 471, ఆర్/డబ్ల్యూ 34ఐపీసీ సెక్షన్ల కింద లేఅవుట్ యజమానులైన రాపాటి వెంకటరత్నం, మొలబంటి రాజారావు, మొలబంటి శ్రీనివాసరావు, మొలబంటి రాఘవరావులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అటవీశాఖలో పదోన్నతి బదిలీలు

8 మంది ఎఫ్ఎస్‌వోలకు డీఆర్‌వోలుగా ఉద్యోగోన్నతి

ఉత్తర్వులిచ్చిన గుంటూరు రేంజ్ సీసీఎఫ్

నెల్లూరు (వెంకటేశ్వరపురం)జూలై 6: గుంటూరు అటవీశాఖ రేంజ్ పరిధిలోని నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలో ఎనిమిదిమంది ఫారెస్ట్ సెక్షన్ అధికారు(ఎఫ్ఎస్‌వో)లకు డిప్యూటీ రేంజ్ అధికారి(డీఆర్‌వో)లుగా పదోన్నతులు కల్పిస్తూ బదిలీలు చేస్తున్నట్లు రేంజ్ సీసీఎఫ్ వైశ్రీనివాసులురెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో నెల్లూరు జిల్లా నుంచి ముగ్గురు పదోన్నతి పొందారు. షేక్ నాయబ్‌రసూల్ నెల్లూరు రేంజ్ నుంచి పదోన్నతిపై శ్రీశైలం టైగర్ ప్రాజెక్ట్ పరిధిలోని మార్కాపురానికి బదిలీ అయ్యారు. ప్రకాష్‌రావును సూళ్లురుపేట వైడ్‌లైఫ్ నుంచి పిడుగురాళ్ల రేంజ్‌లోని మార్కాపురానికి స్థానచలనం కల్పించారు. షేక్ మునీర్‌బాబును ఉదయగిరి రేంజ్‌లోని కృష్ణంపల్లి సెక్షన్ నుంచి మార్కాపురం టైగర్ ప్రాజెక్ట్‌కు బదిలీ చేశారు. త్వరలోనే కింది స్థాయి అన్నీ కేడర్ల ఉద్యోగులకు పదోన్నతులతోపాటు బదిలీలు కూడా నిర్వహించనున్నట్లు అటవీశాఖ ఉన్నతాధికారులు తెలిపారు.

జనం సొమ్ము రాళ్ల పాలు !

● వృథాగా జగనన్న భూరక్ష రాళ్లు

గత వైసీపీ ప్రభుత్వం ప్రజల సొమ్మును ఎలా దుర్వినియోగం చేసిందనడానికి ఈ రాళ్ల గుట్టలే నిదర్శనం. గత ప్రభుత్వంలో వైఎస్ఆర్ జగనన్న భూ సంరక్ష పథకం కింద భూముల రీసర్వేకు శ్రీకారం చుట్టారు. రీసర్వే చేసి హద్దులు తెలిపేందుకు రాళ్లను నాటాలని నిర్ణయించారు. ఈ రాళ్లపై వైఎస్ఆర్ జగనన్న భూరక్ష అని కూడా చెక్కించారు. అప్పట్లో రీసర్వేపై రైతుల నుంచి పలు అభ్యంతరాలు వచ్చాయి. అయినా కొన్ని పొలాల్లో నామమా త్రంగా రాళ్లను నాటారు. ప్రస్తుతం ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చింది. రీసర్వే నిలిచిపోయింది. అయితే ఆ రాళ్లు మాత్రం ఉదయగిరి మండలం యర్రబల్లిగడ్డ గుట్టలుగా పడి ఉన్నాయి. ఈ రాళ్లను చూసి పలువురు వైసీపీ ప్రభుత్వం ప్రజల సొమ్మును ఎలా దుర్వినియోగం చేసిందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఉదయగిరి రూరల్



యర్రబల్లిగడ్డ సెంటర్ వద్ద గుట్టలుగా పడి ఉన్న జగనన్న భూరక్ష రాళ్లు

ఎమ్మెల్యేల సమావేశంలో మంత్రుల నిర్ణయం

ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధిపై సమీక్ష

ఆనం, నారాయణ దృష్టికి నియోజకవర్గాల సమస్యలు

సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి.. కొత్త పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామని అమాత్యుల హామీ



ఎమ్మెల్యేలతో సమీక్షిస్తున్న మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ

అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళదాం...

నెల్లూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లా సమగ్రాభివృద్ధికి సమష్టి కృషి చేయాలని జిల్లా టీడీపీ నేతలు నిర్ణయించుకున్నారు. మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిల నేతృత్వంలో శనివారం జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు సమావేశమ య్యారు. మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా అభివృద్ధి, అందుకు చేయాల్సిన కృషి అనే అంశంపై మంత్రులు, ఎమ్మెల్యేలు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమీక్షలో కలెక్టర్ ఆనంద్, జేసి సేథు మాధవన్ కూడా పాల్గొన్నారు. సమావేశంలో నియోజకవర్గాల వారీగా నెలకొన్న సమస్యలు, ప్రజల అవసరాలను ఎమ్మెల్యేలు మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను కలెక్టర్‌కు మంత్రులు వివరించి, సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సమన్వయంతో మంచి వాతావరణంలో జిల్లాను అభివృద్ధి చేయాలని తీర్మానించారు. ఈ సమావేశ వివరాలను మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణ మీడియాకు వివరించారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి అవసరమైన అర్థవంతమైన చర్చ జరిగిందన్నారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే లక్ష్యంగా రాష్ట్ర పాలన ప్రారంభమైందని, సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారని వారు తెలిపారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అవకా శాలు, ఇదివరకే ఉన్న పరిశ్రమల్లో కల్పించాల్సిన మౌలిక వసతులపై ఎమ్మెల్యేలు కలెక్టర్, జేసీల దృష్టికి తీసుకొచ్చా రని వివరించారు. త్వరలో జిల్లాకు జలవనరుల శాఖ మంత్రిని ఆహ్వానించి సాగునీటి ప్రాజెక్టులు త్వరిత గతిన పూర్తి చేయడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. నెల్లూరు, తిరుపతి జిల్లాల జీవనాడి అయిన సోమశిల ప్రాజెక్టును గత ఐదేళ్ల నుంచి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఆప్రాన్ కొట్టుకుపోవడంతో ప్రాజెక్టు మనుగడే ప్రశ్నార్థకం అయిందన్నారు. త్వరలోనే జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులను పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు. మంత్రి పొంగూరు నారాయణ నాయకత్వంలో జిల్లా పరిధిలోని ఎంపీలు,ఎమ్మెల్యేలంతా సమన్వయంతో సమష్టిగా జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధిని గాడిన పెట్టేందుకు చర్యలు చేపట్టామన్నారు. దగదర్తి ఎయిర్‌పోర్టు, దుగరాజపట్నం పోర్టు, కిసాన్ సెజ్, కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్‌లతోపాటు కొత్త పరిశ్ర మల స్థాపనపై దృష్టి సారించామని వివరించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కాకర్ల సురేష్, కావ్య కృష్ణారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, నెలవల విజయశ్రీ, పాశం సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు(ఫైల్)

బైక్ కనిపిస్తే... క్షణాల్లో మాయం !

- తాళాలు మార్చి.. చిన్నచిన్న చిట్కాలతో దోచేస్తారు..
- పార్కింగ్ సమస్యే దొంగల చేతివాటానికి ఊతం
- అపహరించేవారు సరే.. విక్రయించేవారి మాటేంటి ?
- జిల్లా వ్యాప్తంగా వరుస చోరీలు
- నెల వ్యవధిలో 120 బైక్‌ల స్వాధీనం

నెల్లూరు(క్రైం), జూలై 6: సొంత మోటారు బైక్ కలిగి ఉండడం, దాన్ని వేగంగా తోలడం ప్రతి యువకుడు కల... స్థాయిని బట్టి డౌన్‌పేమెంట్ కట్టి, లేదా అప్పు చేసి నేటి యువకులు ఎంతో ఇష్టంగా బైక్‌లను కొనుగోలు చేస్తుంటారు... కొనుగోలు చేసిన బైక్‌ను ప్రాణంలా చూసుకుంటారు. ఇక మధ్యతరగతి కుటుంబాలకు బైక్ నిత్యావసరం. కుటుంబ అవసరాలకు బైక్ తప్పనిసరిగా ఉండాల్సిందే. అందుకే బైక్‌ను రిపేరుకు ఇస్తే ఇంటిళ్లపాది సెలవు పెట్టి కూర్చుంటారు. మనిషి జీవన శైలిలో బైక్‌కు అంత ప్రాధాన్యత ఉంది.

అయితే ప్రస్తుతం జల్సాలకు అలవాటు పడిన వారికి, ఈజీగా దొంగతనాలు చేసేవారికి ఈ బైక్‌లు వరంలా మారాయి. మారుతాళాలు, అరిగిన తాళాలు వినియోగించడం, చిన్న చిన్న చిట్కాలతో ఎంతో సులభంగా బైక్‌ల తాళాలు తీసేసి దోచేస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా వరుసగా జరుగుతున్న బైక్ దొంగతనాలపై నెల రోజులుగా పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. దీంతో వందల సంఖ్యల్లో బైక్‌లను వారు స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేశారు.

● పార్కింగ్ సమస్యతోనే..

జిల్లావ్యాప్తంగా షాపింగ్‌మాల్స్ ప్రధాన కూడళ్లు, బార్లు, కేఫ్‌లు, హోటళ్లు, వైద్యశాలల వద్ద పార్కింగ్ ప్రాంతాలు లేకపోవడంతో బైక్‌ల యజమానులు కొద్ది సేపటిలో నే వచ్చేస్తాంలే.. ఇక్కడ పెడితే ఏం కాదులే.. అన్న ధోరణిలో రోడ్ల పక్కనే బైక్‌లను నిలిపి వెళుతున్నారు. ఇదే అదునుగా దొంగలు చేతివాటం ప్రదర్శించి వాటిని దోచుకువెళుతున్నారు. ముఖ్యంగా నెల్లూరు నగరంలో బైక్‌ల చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. సీసీ ఫుటేజీల ద్వారా బైక్ దొంగలను గుర్తించినా, పాత నేరస్థులు కావడంతో వారిని పట్టుకోవడం పోలీసులకు సవాల్ మారింది.

● విక్రయించే వారి సంగతేంటి ?

బైక్‌లను దోచేస్తున్న వారిని పోలీసులు వెనుకో ముందో అరెస్ట్ చేస్తున్నారు. అయితే దొంగల వద్ద బైక్‌లు కొని విక్రయిస్తున్న వారిపై మాత్రం పోలీసులు దృష్టి సారించడం లేదు. దీంతో తక్కువ ధరకు, కాగితాలు లేని బైక్‌లను సామాన్యులకు విక్రయిస్తూ కొంతమంది సొమ్ము చేసుకుంటున్నారు. అయితే తక్కువ ధరకు బైక్‌ను కొనుగోలు చేస్తున్న సామాన్యులు మాత్రం, ఆ బైక్ చోరీ జరిగిన సమయంలో బైక్ పోయిందని ఫిర్యాదు ఇచ్చేందుకు అవకాశం ఉండటం లేదు. దీంతో బైక్ దొంగలు దోచేసిన బైక్‌లను మళ్ళీ మళ్లీ దోచేస్తూ జల్సాలు చేస్తున్నారు. ప్రధానంగా పేకాట, క్రికెట్ బెట్టింగ్, సింగిల్ నెంబర్లాట, లోపలా,బయటా లాంటి జూదాలకు అలవాటు పడిన యువతే పదేపదే బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. జిల్లా వ్యాప్తంగా నెలరోజుల వ్యవధిలో పోలీసులు 120కు పైగా బైక్‌లను స్వాధీనం చేసుకొని, నిందితులను అరెస్ట్ చేశారు. దీన్ని బట్టి చూస్తే జిల్లాలో ఏ స్థాయిలో బైక్‌ల దొంగతనాలు జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా ప్రజలు జాగ్రత్త పడాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

కొడిగుడ్డను కిందకి దింపుతున్న పూజారి



ముగిసిన రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

● వైభవంగా ధ్వజావరోహణ ● తగ్గిన హుండీ ఆదాయం

విడవలూరు, జూలై 6 : మండలంలోని రామతీర్థంలో జరుగుతున్న రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ధ్వజావరోహణతో ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ పూజారులు పేరేపి శ్రీకాంత్ శర్మ,శ్రీనివాస శర్మ ధ్వజస్తంభానికి కట్టిన కొడిగుడ్డకు పూజలు నిర్వహించి, కొడిగుడ్డను కిందకు దింపారు. ఆనంతరం సంతానం లేని మహిళలకు కొడిముద్దలను పంపిణీ చేశారు. సాయంత్రం రామతీర్థం గ్రామానికి చెందిన నాశిన వెంకటశేషయ్య, వెంకట శేషమ్మ దంపతుల ఆధ్వర్యంలో స్వామివారికి పూలంగిసేవ నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు ఏకాంతసేవను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా స్వర్గీయ కొమారి చినవెంకయ్య కుటుంబ సభ్యులు, కొనగళ్ల వెంకటశెట్టి వ్యవహరించారు.

గణనీయంగా తగ్గిన హుండీ ఆదాయం

స్వామివారి హుండీ ఆదాయం గత ఏడాది కన్నా ఈ ఏడాది గణనీయంగా తగ్గింది. 2023లో రూ.2.97 లక్షలు రాగా, ఈ ఏడాది రూ.1.98 లక్షలు మాత్రమే వచ్చింది. ఆలయ ఆవరణలో ఈవో రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం ఉదయం హుండీ లెక్కింపు జరిగింది.



హుండీని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ఇసుక ధరలను నిర్ణయిస్తాం: కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), జూలై 6 : జిల్లాలోని ఇసుక రీచ్‌లలో ఇసుక పరిమాణం, రవాణా చార్జీల ధరను నిర్ణయిస్తామని కలెక్టర్ ఆనంద్ చెప్పారు. శనివారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఇసుక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రీచ్‌లలో ఇసుక లభ్యతపై మైనింగ్ అధికారులను ప్రశ్నించారు. ఈ సమావేశానికి ముందు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిల్లాలో ఇసుక ధరలను నిర్ణయించాలని కలెక్టర్లకు సూచించారు. రీచ్‌లలో ఇసుక లభ్యత, పరిమాణం, ధరల వివరాలను వెంటనే నిర్ణయించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ ఇసుక కమిటీ సమావేశం ఏర్పాటు చేసి ధరల విషయాన్ని ప్రకటిస్తామన్నారు.

జునోటిక్ వ్యాధులపై అవగాహన పెరగాలి

● పశుసంవర్ధకశాఖ జేడీ కోటేశ్వరరావు


యాంటీ రేబిస్ టీకా వేస్తున్న జేడీ కోటేశ్వరరావు

నెల్లూరు(వ్యవసాయం), జూలై 6: జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులు(జునోటిక్)పై చిన్నప్పటి నుంచే అవగాహన పెరగాలని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కోటేశ్వరరావు అన్నారు. ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం నెల్లూరు రైల్వేఫీడర్స్ రోడ్డులోని వెటర్నరీ పాలీక్లినిక్ ఆవరణలో ఉచిత యాంటీ రేబిస్ టీకాల పంపిణీ, అవగాహన సదస్సు జరిగాయి. జేడీ మాట్లాడుతూ ప్రతి ఏడాది కుక్కలకు ప్రభుత్వం ఉచితంగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందిస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా జంతు సంరక్షణకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. అనంతరం 262 కుక్కలకు వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి ఎగ్జిక్యూటివ్ అధికారి సోమయ్య, ఆశాఖ అధికారులు మాలకొండయ్య, చైతన్యకిషోర్, రామచంద్రారెడ్డి, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా వర్షం : పలుచోట్ల విద్యుత్ అంతరాయం

నెల్లూరు(హరనాథపురం): జిల్లావ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు వర్షం కురిసింది. శుక్రవారం జిల్లాలో ఎండవేడికి ప్రజలు అల్లాడి పోయారు. అయితే రాత్రి కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. వర్షంతో శనివారం ఉష్ణోగ్రత 30.4 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. గాలులతో కూడిన వర్షంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. శుక్రవారం రాత్రి 11 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. దీంతో దోమలు స్వైరవిహారం చేశాయి. ఒకవైపు వర్షం మరో వైపు దోమలతో జనం విలవిల్లాడారు. ఒంటి గంట ప్రాంతంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందారు.

దుర్గంపై గుప్తనిధుల ముఠా సంచారం

● కొండపై రాత్రివేళలో వెలుగులు


ఉదయగిరి దుర్గం

ఉదయగిరి రూరల్, జూలై 6: రాజులు, నవాబులు పాలించిన దుర్గంపై గుప్తనిధుల తవ్వకాల కోసం ముఠా సంచారం యథేచ్ఛగా కొనసాగుతోంది. శుక్రవారం రాత్రి వర్షంలోనూ కొండపై ఉన్న గరుడాచలం, పెద్ద మసీదు తదితర ప్రాంతాల్లో టార్చిలైట్ వెలుగులు విరజిల్లాయి. ఇది గుప్తనిధుల ముఠా పనేనని పట్టణవాసులు చర్చించుకున్నారు. ఇటీవల అటవీశాఖ అధికారులు తమ సిబ్బందితో దుర్గంపై వారం రోజులపాటు కూంబింగ్ నిర్వహించారు. ఈ కూంబింగ్‌లో పెద్దమసీదుకు సమీపంలోని కోనేరు వద్ద గుప్తనిధుల తవ్వకాలకు ఉపయోగించే ఆధునాతన సామగ్రిని స్వాధీనం చేసుకొన్నారు. గుప్తనిధుల తవ్వకాల ముఠాపై ప్రత్యేక నిఘా ఉంచామని హెచ్చరించారు. వారి హెచ్చరికలు సైతం ముఠాసభ్యులు బేఖాతరు చేస్తూ యథేచ్ఛగా దుర్గంపై తమ కార్యకలాపాలు సాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తవ్వకాల ముఠా సభ్యులకు స్థానికంగా ఉండే పలువురి సహాయ సహకారాలు పుష్కలంగా ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అటవీ, పోలీసు, ఆర్కియాలజీ శాఖల అధికారులు సంయుక్తంగా ప్రత్యేక నిఘా ఉంచి గుప్తనిధుల తవ్వకాల ముఠాలను అదుపులోకి తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రైల్వే హద్దుల పరిశీలన


ఎల్సీగేట్ 144 వద్ద రైల్వే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న గతిశక్తి అధికార బృందం

బిట్రగుంట, జూలై 6: బోగోలు పంచాయతీ రైల్వే ఎల్సీగేట్ 144 వద్ద రైల్వే ప్రాంతాన్ని గతిశక్తి డివిజనల్ చీఫ్ ఇంజనీరు పీవీ రమణరావు బృందంతో శనివారం సాయంత్రం పరిశీలించారు. 2028 నాటికి రైల్వేగేట్లను పూర్తిగా తొలగించాలని రైల్వే ఉన్నతాధికారులు తీసుకున్న చర్యల్లో భాగంగా ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. నూతనంగా తూర్పు నుంచి పడమర వైపునకు నిర్మాణం చేపడితే వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా త్వరలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ అధికాలు రాజేంద్రప్రసాద్, నజీర్, బిట్రగుంట రైల్వే ఐవోడబ్ల్యూ రాజేష్, మండల సర్వేరు శ్రీనివాసులురెడ్డి తదితరులు ఉన్నారు.

సఫాయి కార్మికుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం

● సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యుడు డాక్టర్ వావా


సమీక్షలో మాట్లాడుతున్న కమిషన్ సభ్యులు వావా

నెల్లూరు (సిటీ), జూలై 6 : సఫాయి కర్మచారుల జీవన స్థితిగతుల మెరుగుతో పాటు వారి ఆరోగ్య భద్రత తొలి ప్రాధాన్యంగా తీసుకోవాలని సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వావా అధికారులను ఆదేశించారు. నెల్లూరు పర్యటనలో భాగంగా కార్పొరేషన్ కార్యాలయంలో కలెక్టర్ ఓ ఆనంద్‌తోపాటు కార్పొరేషన్, మున్సిపాలిటీలు, పంచాయతీ, జడ్పీ అధికారులతో ఆయన శనివారం సమీక్ష నిర్వహించారు. ప్రజల ఆరోగ్యం కోసం కష్టపడి పని చేసే సఫాయి కర్మచారుల అభ్యున్నతికి అందరూ చేయూతనందించాలని కోరారు. ప్రమాదవశాత్తు వారికి మరణం సంభవిస్తే రూ.10 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు పరిహారం అందించాలని సూచించారు. బ్యాంకుల్లో రుణాల కోసం వారిపై సెక్యూరిటీ ఒత్తిడి లేకుండా చూడాలని చెప్పారు. సంక్షేమ కార్యక్రమాల్లో వారికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ సేతు మాధవన్, ఎన్ఎంసీ కమిషనర్ వికాస్ మర్మత్, కందుకూరు సబ్‌కలెక్టర్ విద్యాధరి, ఇన్‌చార్జి డీఆర్వో పద్మావతి పాల్గొన్నారు.

క్యూ ఆర్ కోడ్‌తో బిల్లులు చెల్లించండి

● విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ): విద్యుత్ బిల్లుల చెల్లింపులో ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా ఉన్నందున, వాటి నివారణకు పటిష్ట చర్యలు తీసుకున్నామని ఆ శాఖ ఎస్ఈ విజయన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫోన్‌పే తదితర వాటిల్లో బిల్లుల చెల్లింపులు నిలిపివేశామని, బిల్లుల చెల్లింపునకు ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వినియోగదారులంతా ఆ క్యూఆర్ కోడ్ ద్వారా సులభంగా బిల్లులు చెల్లించవచ్చన్నారు. క్యూఆర్‌కోడ్ స్కాన్ చేయగానే 13అంకెల సర్వీసు నెంబరు అడుగుతుందని, దానిని నమోదు చేసి బిల్లు చెల్లించవచ్చని వివరించారు. క్రెడిట్‌కార్డు, డెబిట్ కార్డు, ఇంటర్ నేషనల్ బ్యాంకింగ్, క్యాష్ కార్డు, యూపీఐ, జీపే ద్వారా బిల్లులు చెల్లించవచ్చునని తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	137
లేయర్ లైవ్	115
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	274
లేయర్	195

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6989
వెండి కిలో ధర	రూ. 94,900
వెండి ఒక గ్రాము	రూ. 96.90

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

సీతారామపురం, జూలై 6: రంగనాయుడుపల్లి గ్రామ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుర్రపల్లి బీసీ కాలనీకి చెందిన గండికోట వెంకటమ్మ తీవ్ర గాయాలయ్యాయి. ఉదయం గ్యాస్ కోసం ఆటోలో సీతారామపురం వెళ్లి తిరిగి గ్రామానికి వెళ్తున్నది. ఈ సమయంలో రంగనాయుడుపల్లి గ్రామ సమీపంలో రోడ్డు పైన వెళుతున్న పామును చూసి ఆటో డ్రైవర్ ఒక్కసారిగా ఆటోను పక్కకు తిప్పాడు. వెనుక నుంచి వస్తున్న రంగనాయుడుపల్లి గ్రామనికి చెందిన ట్రాక్టర్ ఒక్కసారిగా ఆటోను ఢీ కొంది. ఈ ప్రమాదంలో వెంకటమ్మకు రెండు కాళ్లకు గాయాలయ్యాయి. ఆమెను చికిత్సనిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న మండల ఎస్ఐ అనూష ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

కండలేరు ఎత్తిపోతలకు గ్రహణం

● ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం ● పైసా విద్యుత్ బిల్లు కట్టకుండా నిర్లక్ష్యం ● రూ.10.87 కోట్ల బకాయిలతో కనెక్షన్ కట్
● ఎండుతున్న ఆరుతడి పంటలు ● తాగునీటికి తలెత్తిన ఇబ్బందులు


పొదలకూరు మండలంలోని కండలేరు ఎడమ కాలువ

నెల్లూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు అంత చేశాం.. ఇంత చేశాం.. వందల కోట్లు ఖర్చు పెట్టాం.. అంటూ వైసీపీ ప్రభుత్వంలో ఆర్భాటం తప్ప నిజంగా రైతులను పట్టించుకున్న పాపాన పోలేదు. కండలేరు ఎడమ కాలువ ఎత్తిపోతల(లిఫ్ట్) పథకమే ఇందుకు నిదర్శనం. గత ఐదేళ్లలో ఒక్క పైసా కూడా విద్యుత్ బిల్లు చెల్లించలేదు. దీంతో భారీగా బకాయిలు పేరుకుపోవడంతో విద్యుత్ అధికారులు కనెక్షన్ తొలగించారు. ఫలితంగా పొదలకూరు, చేజర్ల మండలాల పరిధిలోని సుమారు 20 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందని పరిస్థితి. ఆరుతడి పంటలైన నిమ్మ, జామాయిల్, సవక సాగుకు ప్రస్తుతం నీరు అత్యవసరమైంది. అదే సమయంలో చెరువులన్నీ ఎండిపోవడంతో ప్రజలకు, పశు,పక్ష్యాదులకు కూడా తాగు నీటి సమస్య తలెత్తుతోంది.

● 20వేల ఎకరాలకుపైగా ఆయకట్టు

పొదలకూరు, చేజర్ల మండలాలకు ప్రధానమైది కండలేరు ఎడమ కాలువ. ఈ కాలువ కింద 20వేల ఎకరాలకుపైగా ఆయకట్టు ఉంది. అలానే 34 వరకు చెరువులు ఉన్నాయి. కండలేరు జలాశయం పూర్తి స్థాయి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, 30 టీఎంసీలకు తగ్గితే ఎడమ కాలువకు గ్రావిటీ ద్వారా నీటిని విడుదల సాధ్యం కాదు. ఎప్పుడో వరదలు వచ్చినప్పుడు మినహాయిస్తే మిగిలిన అన్ని సమయాల్లోనూ కండలేరులో 30 టీఎంసీల కన్నా దిగువనే మట్టం ఉంది. దీంతో పొదలకూరు, చేజర్ల మండలాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ వస్తున్నారు. కానీ 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక ప్రస్తుత సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కండలేరు ఎడమ కాలువ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి మోక్షం కలిగించారు. నాటి సీఎం చంద్రబాబు ద్వారా రూ.62 కోట్లు మంజూరు చేయించి, 2015లో పనులు మొదలుపెట్టారు. 2017లో పనులు పూర్తి చేసి పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. అప్పటి నుంచి కండలేరులో నీటి నిల్వలు డెడ్ స్టోరేజీకు చేరుకున్నా, లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఎడమ కాలువకు నీటిని తోడుతూ రైతులు పంటలు పండించుకుంటున్నారు.

● రూ.10.87 కోట్ల బకాయిలు

పలుమార్లు ఇరిగేషన్ అధికారులు విద్యుత్ బకాయిలకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా, ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. ప్రస్తుతం విద్యుత్ బకాయిలు రూ.10.87 కోట్ల వరకు ఉన్నాయి. 2017లో ఈ పథకం ప్రారంభమయ్యాక అప్పటి టీడీపీ ప్రభుత్వంలో రూ.3 కోట్లు విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి ఉంది. వీటిని జిల్లా స్థాయిలో ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. కానీ ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో విద్యుత్ బకాయిల అంశం పక్కకు వెళ్లింది. టీడీపీ ప్రభుత్వంలో పంపిన ప్రతిపాదనలను వెనక్కు పంపడమే కాకుండా 2019-24 మధ్య ఐదేళ్లలో ఉపయోగించిన విద్యుత్‌కు కూడా బిల్లులు చెల్లించలేదు. ఆ ప్రభావం ఇప్పుడు రైతులపై తీవ్రంగా పడుతోంది. ఇక రెండేళ్ల క్రితమే ఈ లిఫ్ట్ ఇరిగేషన్ మెయింటెనెన్స్ పీరియడ్ కూడా ముగిసింది. దీంతో కాంట్రాక్టర్ ఈ పథకాన్ని అధికారులకు అప్పగించారు. వైసీపీ ప్రభుత్వం నిర్వహణకు కూడా నిధులు విడుదల చేయలేదు. ఇరిగేషన్ అధికారులే సొంత డబ్బులతో నిర్వహణ భారాన్ని మోస్తున్నారు. ఇటీవల పొదలకూరు మండలంలోని రైతులు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఎడమ కాలువకు నీరు ఇవ్వకపోతుండడంతో పంటలు ఎండుముఖం పడుతున్నాయని విన్నవించుకున్నారు. దీంతో ఆయన వెంటనే ఇరిగేషన్ అధికారులతో ఈ పథకంపై సమీక్షించారు. విద్యుత్ బకాయిలు పేరుకుపోవడంతో కనెక్షన్ కట్ చేశారని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వెంటనే బకాయిలకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపాలని సోమిరెడ్డి ఆదేశించారు. ప్రస్తుతం అధికారులు ఆ పనిలో నిమగ్నమయ్యారు.

ప్రతిపాదనలు పంపుతున్నాం

కండలేరు లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి సంబంధించి రూ.10.87 కోట్ల విద్యుత్ బిల్లులు పెండింగ్ ఉన్నాయి. ఇవి చెల్లించకపోతే కనెక్షన్ కట్ చేస్తామంటూ విద్యుత్ శాఖ నుంచి నోటీసులు అందాయి. ఈ నేపథ్యంలో బకాయిలు చెల్లించాలంటూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నాం.

- ఎం అనిల్‌కుమార్‌రెడ్డి, టీజీపీ మూడో డివిజన్ ఈఈ

● పథకంపై నిర్లక్ష్యం

గత వైసీపీ ప్రభుత్వంలో ఈ పథకం నిర్లక్ష్యానికి గురైంది. 2019-24 మధ్య లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా రైతులకు నీరు సరఫరా చేశారు. కానీ విద్యుత్ బకాయిలు మాత్రం చెల్లించలేదు. నాలుగేళ్లపాటు బకాయిలు చెల్లించకపోవడంతో గతేడాది విద్యుత్ అధికారులు లిఫ్ట్ ఇరిగేషన్‌కు విద్యుత్ కనెక్షన్ కట్ చేశారు. కీలక సమయంలో ఇలా జరగడంతో రైతులంతా ఆందోళనకు దిగారు. అయినా ప్రభుత్వం బకాయిలు చెల్లించలేదు. తాత్కాలికంగా విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి మళ్లీ కనెక్షన్ ఇప్పించారు. గతేడాది సీజన్ ముగిసిన తర్వాత కూడా నాటి పాలకులు పాఠాలు నేర్వలేదు. దీంతో మళ్లీ విద్యుత్ అధికారులు కనెక్షన్ కట్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సమయంలో ఇరిగేషన్ అధికారులు సమన్వయం చేసుకుంటూ అడపాదడపా లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్లు ఆడిస్తూ వస్తున్నారు. అయితే ప్రస్తుతం వేసవి తీవ్రంగా ఉండడం, వర్షాలు లేకపోవడంతో పొదలకూరు, చేజర్ల మండలాల్లోని ఆరు తడి పంటలు ఎండుముఖం పడుతున్నాయి. చెరువులన్నీ నిండుకున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

పంటలు ఎండబెట్టారు...



మెట్ట ప్రాంత రైతుల కోసం గత టీడీపీ ప్రభుత్వంలో కండలేరు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని తీసుకొచ్చారు. కానీ వైసీపీ ప్రభుత్వంలో కరెంటు బిల్లులు కూడా చెల్లించలేదు. పంటలు ఎండిపోతున్నా నాటి పాలకులు పట్టించుకోలేదు.

- నెట్టెం పెంచలయ్య, నిమ్మ రైతు

లైనింగ్ పనులు చేయలేదు



ఏడాదిలో పూర్తి చేయాల్సిన కాలువ లైనింగ్ పనులను గత ప్రభుత్వం మూడేళ్ల పాటు చేస్తున్నట్లే నటించి కాలం గడిపింది. లిఫ్ట్ ఇరిగేషన్‌ను సక్రమంగా ఉపయోగిస్తే ఎడమ కాలువ లైనింగ్ పనులు అవసరం లేదు. కేవలం కమీషన్ల కోసం లైనింగ్ పనులు చేపట్టారు. ఆ పనులు కూడా పూర్తి చేయలేదు.

- కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, రైతు సంఘం నాయకుడు

క్రీడా స్టేడియం నిర్మాణాన్ని చేపడతాం

● మంత్రి రాంప్రసాద్‌రెడ్డి


మినీ స్టేడియం క్రీడామైదానం పరిశీలిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, జూలై 6: కావలి పట్టణ మినీ స్టేడియంలో త్వరలో అన్ని వసతులతో స్టేడియం నిర్మాణం చేపడతామని రాష్ట్ర రవాణా, క్రీడల శాఖా మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. విజయవాడ నుంచి రాయచోటి వెళుతున్న మంత్రి కావలి ఎమ్మెల్యే ఆహ్వానం మేరకు ఆయన ఇంటికి వచ్చారు. దీంతో కావలి నియోజకవర్గంలో రవాణా, క్రీడలకు సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందచేశారు. అనంతరం స్థానిక ఉదయగిరి రోడ్డులో ఉన్న మినీ స్టేడియం స్థలాన్ని ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డితో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ త్వరలోనే స్టేడియంకు మంచి రోజులు వస్తాయని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. స్టేడియంలో అవసరమైన క్రీడా వసతులకు సంబంధించి డీపీఆర్ పంపితే త్వరలో స్టేడియం నిర్మాణం జరిగేట్లు చర్యలు చేపడతానన్నారు. గత ప్రభుత్వం క్రీడా రంగాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, పోతుగంటి అలేఖ్య, మలిశెట్టి వెంకటేశ్వర్లు, జ్యోతి బాబూరావు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కే బ్రహ్మానందం కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

బొమ్మవరం ఆశావర్కర్ సస్పెన్షన్

అనంతసాగరం: మండలంలోని బొమ్మ వరం ఆశావర్కర్ డీ సుశీలను అధికారులు శనివారం సస్పెండ్ చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆశావర్కర్ వైసీపీకి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు ఆ పంచాయతీకి చెందిన వార్డు మెంబర్ చిట్టిబాబు వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారించిన ఉన్నతాధికారులు ఆమెను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు అనంతసాగరం వైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి విలేకర్లకు తెలిపారు. ఆమె వద్ద ఉన్న వస్తువులు స్వాధీనం చేసుకున్నారు.

ఆర్థిక, సామాజిక సాధికారతే ధ్యేయం

● అంతర్జాతీయ సహకార దినోత్సవంలో డీసీవో గురప్ప


ఎన్‌డీసీసీబీలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

నెల్లూరు(హరనాథపురం), జూలై 6 : ప్రజలందరికీ ఆర్థిక, సామాజిక, సాధికారత కల్పించటమే సహకార సంఘాల ధ్యేయమని జిల్లా సహకారశాఖాధికారి గురప్ప అన్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా 102వ అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కోఆపరేటివ్ బ్యాంకులో డీసీవో, ఎన్‌డీసీసీబీ సీఈవో శ్రీనివాసరావు, జీఎం సరితతో కలిసి సహకార పతాకాన్ని ఎగుర వేశారు. ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా గురప్ప మాట్లాడుతూ సహకార శాఖ, సహకార సంఘాల సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించి సహకార సంఘాల పటిష్టతకు కృషి చేయాలని కోరారు. ప్రపంచ జనాభాలో 12 శాతం మంది సహకార సంఘాల్లో సభ్యత్వం కలిగి ఉండటం విశేషమన్నారు. జిల్లాలో సహకార సంఘాల అభివృద్ధికి అన్నీ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్‌డీసీసీబీ సీఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో అన్ని రంగాల ప్రజలకు ప్రయోజనం కలిగించే సహకార వ్యవస్థ చాలా గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార ఆడిట్ అధికారి పీ తిరుపతయ్య, సహకార విద్యాధికారి జీ శ్రీనివాసులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు, డివిజనల్ కోఆపరేటివ్ అధికారుల కార్యాలయాల్లోనూ సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. నగరంలోని కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో జరిగిన కార్యక్రమంలో సంస్థ చైర్మన్ అరిగెల నాగేంద్రసాయి. సీఈవో మాగుంట అనిత, సిబ్బంది పాల్గొన్నారు. నెల్లూరు కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీలో పర్సన్‌ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ ఆదేశాలతో బిజినెస్ మేనేజర్ వెంకటస్వామి, సిబ్బంది సహకార పతాకాన్ని ఎగురవేశారు.

ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధిపై మంత్రుల సమీక్ష


అధికారులతో సమీక్షిస్తున్న మంత్రులు ఆనం, నారాయణ

నెల్లూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధిపై మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిలు అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం ఆత్మకూరు ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, మున్సిపాలిటీ ఇంజనీరింగ్ అధికారులతో మంత్రులు సమీక్షించారు. అనంతరం మంత్రులు సమీక్ష విశేషాలను మీడియాకు వివరించారు. ఆత్మకూరు మున్సిపా లిటీ అభివృద్ధిపై మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అధికారులతో సుదీర్ఘంగా చర్చించారన్నారు. మున్సిపాలిటీలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్‌శాఖ అధికారులను మంత్రి నారాయణ ఆదేశించారన్నారు. మున్సిపా లిటీ ఆదాయ వ్యయాలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు వివరించామని, ఆయన వెంటనే స్పందించి అభివృద్ధికి అవసరమైన నివేదికలు సిద్ధం చేయమని అధికారు లను ఆదేశించారని ఆనం తెలిపారు. అసంపూర్తిగా నిలచిపోయిన ఆర్డీవో కార్యాలయం, ఆర్‌అండ్‌బి అతిధిగృహం, పాలిటెక్నికల్ కళాశాల మొదలైన వాటిని పూర్తి చేయడానికి చర్యలు చేపడతామన్నారు. ఆత్మకూరు మున్సి పాలిటీలో గత ఐదేళ్ల కాలంలో జరిగిన అక్రమాలు, అవినీతి, అక్రమ లేఅవు ట్లపై మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ దృష్టి సారించారని, ఇందుకు సంబంధించిన సమగ్ర నివేదికలు అందజేయాలని అధికారులను ఆదేశించా రన్నారు. మున్సిపల్ బస్టాండులోని పాత భవనాన్ని తొలగించి కొత్త బస్టాండు నిర్మించారని, దానిని ఎవరు మంజూరు చేశారు, దానికి ఎలా నిధులు సమకూరాయి, మున్సిపల్ కాంప్లెక్స్ భవనాలు ఎందుకు ఖాళీగా ఉన్నాయి అని అడిగితే అధికారులు సమాధానం చెప్పలేకపోయారన్నారు. వీటన్నింటిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని మున్సిపల్ శాఖ మంత్రి అధికా రులను ఆదేశించారన్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధికి నుడా నుంచి కొన్ని నిధులు మంజూరు చేస్తామని, తక్షణ అవసరాల కల్పనకు వాటిని వినియోగించాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశిం చారన్నారు.

● మున్సిపల్ లేఅవుట్లలో అక్రమాలు

మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో అవకతవకలు జరిగాయని, ప్రధానంగా లేఅవుట్ల విషయంలో చాలా అక్రమాలు జరిగాయని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, అర్బన్ అథారిటీలలో జరిగిన అక్రమాలపై విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని ప్రిన్స్‌పల్ సెక్రటరీని ఆదేశించామన్నారు. నెల్లూరు, కడప జిల్లాల్లో త్రిమెన్ కమిటీ వేశామన్నారు. ఆ నివేదికలు వచ్చిన తరువాత చట్టప్రకారంగా చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ శాఖలో అక్రమాలకు పాల్పడిన వారిని వదిలిపెట్టే ప్రశ్నే లేదన్నారు.

సోమశిలలో 10.090 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం: పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శనివారంకు డ్యాంలో 10.090 టీంఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 304 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా దిగువ డెల్టాకు 600, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

గదులు చాలక..టీచర్లు లేక ఇక్కట్లు

- 10గదులు.. 529 మంది విద్యార్థులు
- వాటిలో శిథిలావస్థ గదులే దిక్కు
- 12మందే ఉపాధ్యాయులు
- అవస్థలు పడుతున్న ఉదయగిరి ఉన్నత పాఠశాల విద్యార్థులు



శిథిలావస్థకు చేరిన తరగతి గదులు



ఇరుకు గదుల్లో విద్యార్థుల అవస్థలు

ఉదయగిరి రూరల్, జూలై 6: స్థానిక ఉన్నత పాఠశాలలో నూతన తరగతులను నిర్మించక పోవడంతో విద్యార్థులు,ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 529 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలకు పది తరగతి గదులు ఉన్నాయి. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా గదులు లేకపోవడంతో ఒకే గదిలో రెండు, మూడు తరగతులను నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. ఉన్న గదులు దశాబ్దాల క్రితం నిర్మించినవి కావడంతో శిథిలావస్థకు చేరి పైకప్పు పెచ్చులూడి పడుతుండడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేసేదిలేక ఉపాధ్యాయులు కొన్ని తరతులను చెట్ల కింద నిర్వహిస్తున్నారు. దీనికితోడు పాఠశాలలో 26మంది ఉపాధ్యాయులు ఉండాల్సి కేవలం 12మంది మాత్రమే ఉన్నారు. ప్రధాన సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేక పోవడంతో మిగిలిన ఉపాధ్యాయులు అదనపు తరగతులు తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వసతులు లేకపోయినా ప్రతి ఏడాది పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ చూపుతున్నారు.

నాడు-నేడు పనుల్లో అవస్థలే:

మన బడి నాడు-నేడు పథకం కింద రెండో విడత మరమ్మతులు, అదనపు తర గతి గదుల నిర్మాణాలకు గత ప్రభుత్వం రూ.1.50కోట్లను మంజూరు చేసింది. వాటిలో రూ.65లక్షలు మాత్రమే విడుదల చేయడంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కొంతమేర పనులు చేపట్టి వదిలేశారు. అప్పటినుంచి నిధులు మంజూరు కాకపోవడంతో అదనపు తరగతి గదుల నిర్మాణం అసంపూర్తిగానే ఉన్నాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు శిథిలావస్థకు చేరిన తరగతి గదుల్లోనే కాలం వెల్లదీయాల్సిన దుస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి పనులు పూర్తి చేసి ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆర్డీ నగదు స్వాహాపై విచారణ



ఖాతాదారులతో చర్చిస్తున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ

ఉదయగిరి రూరల్, జూలై 6: పుల్లాయపల్లి బ్రాంచ్ పోస్టుమాస్టర్ షేక్ నాయబ్‌రసూల్ ఖాతాదారుల ఆర్డీ నగదు స్వాహా ఘటనపై శనివారం ఎంపీడీవో ఈశ్వరమ్మ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె పోస్టాఫీసును తనిఖీ చేయడంతో పాటు ఖాతాదారులను విచారించి పాసుపుస్తకాలను పరిశీలించారు. అనంతరం ఖాతాదారుల నుంచి లిఖితపూర్వకంగా ఫిర్యాదు స్వీకరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి కరీముల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వైఎస్ఆర్ జయంతిని జయప్రదం చేయండి

ఉదయగిరి, జూలై 6: మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని జయప్రదం చేయాలని ఉదయగిరి-1 ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపతి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలన్నారు.

సకాలంలో పాఠ్యపుస్తకాల పంపిణీ

ఉదయగిరి, జూలై 6: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు రెండోవిడత పాఠ్యపుస్తకాలు అందజేయనున్నట్లు శనివారం ఎంఈవో-2 తోట శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పుస్తకాల పంపిణీ స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న విద్యార్థుల అడ్మిషన్ల ప్రకారం 1 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేసేందుకు నివేదికలు తయారు చేయాలన్నారు. త్వరలో బూట్లు, యూనిఫాం, బ్యాగ్‌లు అందజేస్తామన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయాలి

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జూలై 6: చిన్నారులు, గర్భవతులు, బాలింతలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయాలని దుత్తలూరు పీహెచ్‌సీ ఆరోగ్య పర్యవేక్షకులు ఖాజామొహిద్దీన్ సూచించారు. శనివారం వెంకటంపేటలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఎంఎల్ హెచ్‌పీ కిరణ్మయి, సిబ్బంది శ్రీహరి, ప్రశాంతి, ప్రభావతి పాల్గొన్నారు.

మహిళా సాధికారతతో సమానత్వం



ర్యాలీలో పాల్గొన్న ఏపీఎం వెంకమ్మ, వీవోవోబీ, సీసీ, వీవోఏలు

ఆత్మకూరు, జూలై 6: మహిళా సాధికారతతో సమానత్వం సాధించాలనే లక్ష్యంతో పేదరిక నిర్మూలన దిశగా పొదుపు మహిళలందరికీ ఆర్థిక స్వావలంబన చేకూర్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అందుబాటులోకి తెస్తోందని ఏపీఎం వెంకమ్మ తెలిపారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని మండల సమైక్య కార్యాలయంలో వీవోవోబీ, సీసీ, వీవోఏలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ ఎండి మున్వర్, ఫీల్డ్ ఆఫీసర్ షేక్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

సోమశిల క్యాంపు కాలనీలో అంధకారం

అనంతసాగరం, జూలై 6: సోమశిల క్యాంపు కాలనీలో వీధి దీపాలు వెలగక అంధకారం నెలకొంది. సమస్యను డ్యాం అధికారులకు విన్నవించినా ఫలితం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. విషసర్పాలు ఎక్కువగా వున్నాయని, అధికారులు దీపాలు వెలిగించేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

చినుకు పడితే చిత్తడే..!

అనంతసాగరం, జూలై 6: మండల కేంద్రంలో పలు వీధులు అధ్వానంగా ఉన్నాయి. మురుగు కాలువలు లేక వర్షపు నీరు బయటకు వెళ్లే వెసులుబాటు లేదు. దీంతో చిన్నపాటి వర్షం పడినా రహదారులు చిత్తడిగా మారుతున్నాయి. స్థానిక బీసీ కాలనీలో రోడ్డుపై బురదతో స్థానికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని బీసీ కాలనీ వాసులు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న బీసీ కాలనీ రహదారి

కుక్కలకు ఉచితంగా రేబిస్ నివారణ వ్యాక్సిన్



పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

సంగం, జూలై 6: మండలంలోని మర్రిపాడు పశువైద్యశాలలో ప్రపంప జూనోసిస్ డే సందర్భంగా పశువైద్యురాలు డాక్టర్ డి.సుజని ఆధ్వర్యంలో శనివారం కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెంపుడు కుక్కల యజమానులు అవకాశాన్ని వినియోగం చేసుకోవాలని కోరారు.

చేజర్ల: ప్రపంచ జోనోసిస్ డే సందర్భంగా శనివారం మండల కేంద్రమైన చేజర్లలోని పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో డా. పి రాజేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చిత్తలూరు పీహెచ్‌సి కేంద్రంలో నవీన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

వరికుంటపాడు: పెద్దిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి ఎస్‌వీ రాఘవేంద్ర మాట్లాడుతూ జూనోటిక్, రేబిస్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించారు. మండలంలోని అన్ని పశువైద్యశాలలు, రైతుసేవా కేంద్రాల పరిధిలోని కుక్కలకు ఉచితంగా టీకాలు వేయించామన్నారు. అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు మనిదీప్, డీ మణిచందన, వైష్ణవీలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల సంరక్షణే లక్ష్యం



మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్‌కుమార్

ఆత్మకూరు, జూలై 6 : బాలికల సంరక్షణే లక్ష్యంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు ప్రత్యేకశ్రద్ధ వహించాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు అవసరమైన ఆరోగ్య పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ చూపాన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు ఆశావర్కర్లు గుర్తించి వెంటనే అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. అనంతరం బాలికలు తీసుకోవాల్సి జాగ్రత్తలపై ముద్రించిన హ్యాండ్ బుక్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆత్మకూరు సీడీపీవో సునీలత, డాక్టర్ అస్మా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మీ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజవోలు సహకార సంఘం అభివృద్ధికి కృషి

ఏఎస్ పేట, జూలై 6: స్థానిక రాజవోలు ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో అంతర్జాతీయ సహకార దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో జెండా ఆవిష్కరించారు అనంతరం సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సంఘం పర్సన్ ఇన్‌చార్జ్ బి సత్యనారాయణ, ఏఎస్ పేట ఎన్‌డిసిసి బ్యాంక్ మేనేజరు సిహెచ్ వి సుబ్బారెడ్డి, అసిస్టెంట్ మేనేజరు హరీష్ పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి పరామర్శ



రైతు కుంటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

అనంతసాగరం, జూలై 6: మండలంలోని చిలకలమర్రి గ్రామానికి చెందిన కౌలురైతు డబ్బుకొట్టు శీనయ్య ఇటీవల పాము కాటుతో మృతిచెందగా శనివారం సీపీఎం రాష్ట్ర కౌలు రైతు సంఘం సభ్యులు గంట లక్ష్మీపతి, మండల కార్యదర్శి అన్వర్‌బాష అత ని కుటుంబాన్ని పరామర్శించారు. కౌలు రైతుచట్టం ద్వారా రూ.10లక్షలు ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరతామన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో గోపాల్

ఆత్మకూరు, జూలై 6: విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఆత్మకూరు ఉప విద్యాశాఖాధికారి కె.గోపాల్ సూచించారు. శనివారం ఆయన మండలంలోని కరటంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి వసతులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా ఉన్నాయని, మెరుగైన విద్యను అందించాలని సూచించారు.

క్రీడలకు దూరమైన విద్యార్థులు


- ఆటస్థలం లేక ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



సీతారామపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

సీతారామపురం, జూలై 6: మండలకేంద్రంతో పాటు ఓగూరువారిపల్లి జడ్పీహెచ్ఎస్ స్కూల్, ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో 6 వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యాబోధన నిర్వహిస్తున్నారు. దాదాపు 1160 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కానీ ఈ పాఠశాలలకు క్రీడా మైదానం లేదు. క్రీడలను ఆడించేందుకు ఫిజికల్ డైరెక్టర్ ఉన్నా వాలీబాల్, కబడ్డీ, హాకీ తదితర క్రీడలను ఆడించలేని దుస్థితి నెలకొంది. పాఠశాల ఆవరణలో విరామ సమయంలో ఆడుకోవాల్సి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు ఆట స్థలాన్ని కేటాయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

క్రీడామైదానం ఏర్పాటు చేయాలి



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలు, కస్తూర్బా, మోడల్ స్కూల్ పాఠశాలలో ఆట స్థలం లేదు. విద్యార్థులు క్రీడల్లో ఆసక్తి ఉన్నా దూరంగా ఉండాల్సిన పరిస్థితి. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా మైదానాన్ని ఏర్పాటు చేయడంలో విఫలమైంది.

- శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయుడు

సౌకర్యాలు కల్పించాలి

మోడల్ స్కూల్, కస్తూర్బాగాంధీ స్కూల్‌లో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలి. అలాగే మెయిన్ రోడ్డు నుంచి కేజీబీవీ పాఠశాలకు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. తారు రోడ్డు ఏర్పాటు చేస్తే ఇబ్బందులు ఉండవు.

- షేక్ షాజిదా, కస్తూర్బాగాంధీ స్కూల్ హెచ్ఎం

ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించండి

లింగసముద్రం, జూలై 6: సచివాలయాలకు వచ్చే ప్రజల సమస్యలు పరిష్కారానికి సత్వరం పరిష్కరించాలని ఎంపీడీఓ కె శ్రీనివాసులు తెలిపారు. శనివారం లింగసముద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అర్జీలను పెండింగ్‌లో ఉంచవద్దన్నారు.

ప్రసన్నుడికి పూజలు



శ్రీదేవీ, భూదేవిలతో ఊంజల్ సేవలో శ్రీనివాసుడు

బిట్రగుంట, జూలై 6: బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంపై వెలసిన ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అమ్మవార్లకు శనివారం ప్ర త్యేక పూజలు జరిగాయి. అల్లూరు మండలం పురిణి గ్రామానికి చెందిన గండవరం మురళీకృష్ణ కుటుంబ సభ్యులు ఆలయ ప్రాంగణంలో అన్న సంతర్పణ చేశారు. సాయంత్రం శ్రీనివాసునికి ఊంజల సేవ జరిగింది.

రూ.10 కోట్లతో రోడ్లు, డ్రైన్ల నిర్మాణం

వరవ కాలువ పూడికతీత పనుల ప్రారంభం

- ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి



పూడికతీత పనులకు ప్రారంభోత్సవం చేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, జూలై 6: పట్టణంలో త్వరలో రూ.10 కోట్లతో రోడ్లు, డ్రైన్లు నిర్మాణం చేపట్టనున్నట్లు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. శనివారం నెల్లూరులో మంత్రులు పొంగూరి నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలతో జిల్లా ఎమ్మెల్యేలు సమావేశం కాగా, కావలిలో రోడ్లు, డ్రైన్లు నిర్మాణానికి రూ. 10 కోట్లతో ప్రతిపాదనలు పంపమని మంత్రులు చెప్పారన్నారు. కావలి పట్టణ మానస థియేటర్ సెంటర్‌లో వరవకాలువ పూడికతీత పనులను కావలి ఆర్డీవో శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ జీ శ్రావణ్‌కుమార్‌తో కలిసి శనివారం సాయంత్రం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలిలో ప్రజల మనోభావాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. అవినీతి రహిత పాలన అందిస్తానని, తన నివాసం వద్ద ఒక గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేసి ప్రజల సమస్యల సత్వర పరిష్కార దిశగా చర్యలు చేపడతానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సాయిరాం, టీడీపీ నేతలు మలిశెట్టి వెంకటేశ్వర్లు, పోతుగంటి అలేఖ్య, గుత్తికొండ క్రిషోర్, మలిశెట్టి విజయలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

జేసీని కలిసిన ఇంటూరి



జేసీని సత్కరిస్తున్న ఇంటూరి నాగేశ్వరరావు

నెల్లూరు(హరనాథపురం), జూలై 6: కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌ను ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించారు.

ఇస్కపల్లి పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతా : బీద



అధికారులతో మాట్లాడుతున్న బీద రవిచంద్ర

అల్లూరు, జూలై 6: మండలంలోని ఇస్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠాశాలను ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దుతానని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర అన్నారు. పాఠశాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన స్వగ్రామమైన ఈ పాఠశాలలో మత్స్యకార విద్యార్థులు అత్యధికంగా విద్యను అభ్యసిస్తున్నారని అటువంటి పాఠశాలను మండలంలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో బీద గిరిదర్, సర్వశిక్షా అభియాన్, విద్యాశాఖ అధికారులు ఉషారాణి, రవీంద్రనాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాధినేతల చిత్రపటాల ఏర్పాటు

జలదంకి, జూలై 6: మండలంలోని చినక్రాక గ్రామ సచివాలయంలో ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చిత్రపటాలను శనివారం ఏర్పాటు చేశారు. ఈ చిత్రపటాలను ఎన్డీఏ కూటమి నాయకులు సచివాలయం సిబ్బందికి అందచేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు శివారెడ్డి, రవి, రామ్‌చైతన్య, మురళీ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

జలదంకి, జూలై 6: మండలంలోని అన్ని రైతుసేవా కేంద్రాలలో భూసార పరీక్షలకు మట్టి నమూనాలు సేకరిస్తున్నట్లు వ్యవసాయాధికారిణి బి శైలజ శనివారం పేర్కొన్నారు. రైతులు స్థానిక ఆర్ఎస్‌కెలలో విఏఎలను సంప్రదిస్తే వారు రైతుల భూమికి వెళ్ళి మట్టిని సేకరించి పరీక్షలు జరిపించి భూమిలో ఉన్న లోపాలను రైతులకు చేరవేస్తారన్నారు. ఈ అవకాశాన్ని మండల రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని ఎఓ కోరారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు

జలదంకి, జూలై 6: మండలంలోని 17 పంచాయతీలలో పారిశుధ్య, తాగునీటి వనరుల క్లోరినేషన్ పనులు చేపడుతున్నట్లు ఎండిఓ రామచంద్ర శనివారం పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ పనులు చేపడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

డీలర్‌ను కఠినంగా శిక్షించాలి

కందుకూరు, జూలై 6: విధుల్లో ఉన్న ఎస్టీటీ ఉపాధ్యాయుడిని దుర్భాషలాడిన రేషన్ డీలర్‌ను కఠినంగా శిక్షించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కళ్లకుంట మోహనరావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

భోజనషెడ్ నిర్మాణానికి భూమిపూజ

ఉలవపాడు, జూలై 6: రామాయపట్నం జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతి షెడ్ నిర్మాణానికి దాత నాగయ్య ప్రతినిధిగా మాజీ సర్పంచ్ కృష్ణ శనివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, సెక్రటరి నాగేశ్వరరావు, పీడీ జీవన్ కుమార్, గ్రామపెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలువలో పూడికతీత

బిట్రగుంట, జూలై 6: విశ్వనాథరావుపేట పంచాయతీలోని ప్రధాన కాలువలో పూడిక తీత పనులు సర్పంచు గండూరి మంజుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి మహబూబ్ బాషా శనివారం చేపట్టారు. రానున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని కాలువ ఆక్రమణలు తొలగించి పూడిక తీస్తున్నట్లు సర్పంచు తెలిపారు.

జేబీ కళాశాలలో కూలిన భారీ వృక్షం

కావలి రూరల్, జూలై 6: కావలి పట్టణ జవహర్ భారతి డిగ్రీ కళాశాలకు వెళ్లే దారిలో ఉన్న భారీ వేప వృక్షం శుక్రవారం రాత్రి వీచిన గాలులకు కూలి రోడ్డుపై పడింది. దీంతో వేపచెట్టు కొమ్మలు పడి విద్యుత్ తీగలు తెగిపోవడంతో పాటు రెండు స్తంభాలు కూడా దెబ్బతిన్నాయి.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న నేతలు

కావలి టౌన్, జూలై 6: భారతదేశ ఉప ప్రధాని దివంగత బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ట్రంకురోడ్డులోని ఆయన విగ్రహానికి ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఎమ్మెస్పీ నేతలతో పాటు పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మందా వెంకటేశ్వర్లు, కిరణ్, వెంకటేశ్వర్లు, ఏసురత్నం, వరప్రసాద్ తది తరులు పాల్గొన్నారు.

ఉలవపాడు: మండలంలోని కరేడు గ్రామంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు ఆలూరి కోటేశ్వరరావు, గడ్డం నవీన్‌లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు శ్రీనివాసులు, గోపాల్, ఏలియా, జాలయ్య, క్రాంతిరాజు, ప్రసాద్, శివరాం తదితరులు పాల్గొన్నారు.

జలదంకి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి తహసీల్దార్ వాసు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిటి భరత్, ఆర్ఐ శ్రీను, వీఆర్వోలు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి



కావలిటౌన్: శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

కావలిటౌన్, జూలై 6: జన సంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని శనివారం బీజేపీ నేతలు ఆయనకు ఘన నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు బ్రహ్మానందం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో నే తలు వింతా రంగారెడ్డి, కమల, మాధవి, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు: శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను అల్లూరు బీజేపీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కన్యాపురి శ్రీనివాసులు, తాళ్లూరు నవీన్‌కుమార్, కృష్ణసాయి నాయుడు, కత్తుల కిరణ్, మల్లికార్జున సింగ్, శంకర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు టీకాలు

లింగసముద్రం, జూలై 6: పెంపుడు కుక్కలకు జూనోసిస్ వ్యాధులు సోకకుండా యాంటీ రేబిస్ టీకాలు వేయించుకోవాలని మండలంలోని లింగసముద్రం, వీఆర్ కోట పశువైద్యాధికారులు డా. ఆర్ సౌమ్య, డా. వై శ్రీకాంత్ తెలిపారు. శనివారం జూనోసిస్ డే సందర్భంగా కుక్కలకు యాంటీ రేబిస్ టీకా వేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గాలంకి ప్రసాద్, అడపా రంగయ్య, కొట్టే శేషాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

బిట్రగుంట,(దగదర్తి) : దగదర్తి మండలం చెన్నూరు పశు వెద్యశాలలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఉచిత రాబీస్ నివారణ టీకా కార్యక్రమం పశు వైద్యాధికారి మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో సచివాలయ సహాయక పశువెద్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ. 8,81,984

వలేటివారిపాలెం, జూలై 6 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుండి రూ. 8,81,984 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే బీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అష్టోత్తరం టిక్కెట్ల ద్వారా రూ. 6,200, కుంకుమార్చన ద్వారా రూ. 23,360, వివాహముల ద్వారా రూ. 1000, తలనీలాలు ద్వారా రూ. 39,750, వాహనపూజలు ద్వారా రూ. 4,300, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 2,12,700, స్థలపురాణం పుస్తకాలు విక్రయం ద్వారా రూ. 800, రూముఅద్దెలు ద్వారా రూ. 31,120, కవర్లు ద్వారా రూ. 5,400, లడ్డుప్రసాదం ద్వారా రూ. 2,09,585, అన్నదానం ద్వారా రూ. 3,13,503, విరాళముల ద్వారా రూ. 34,226 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు తెలియజేశారు.

ఆకట్టుకున్న కోలాటం

మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం ఏర్పాటుచేసిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. స్వామివారి దర్శనం అనంతరం భక్తులు కోలాటం తిలకించారు. కాగా, ఆషాఢ మాసం కావడంతో భక్తుల సంఖ్య తగ్గింది.

విద్యార్థుల సౌకర్యార్థం బస్సులు నడపాలి

కావలి రూరల్, జూలై 6: పాఠశాలల విద్యార్థులకు స్కూల్ బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికోసం ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులు నడపాలని శనివారం కావలి, బోగోలు మండలాల టీడీపీ నేతలు ఆర్టీసీ డిఎంను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోసూరి వెంకటేశ్వర్లు, ఉప్పాల శ్రీనివాసులు, మక్కి శ్రీహరి, ప్రసాద్, బోగోలు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచెరువు తూముకు చెక్క ఏర్పాటు

జలదంకి, జూలై 6: రెండేళ్ళ నుండి జలదంకి మండలం దాసరి అగ్రహారం ఎర్రచెరువు తూములకు చెక్కలు లేక రైతులు మట్టికట్టలు కట్టుకుని సాగునీటిని కాపాడుకుంటూ వచ్చారు. కొత్తగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో కూటమి నాయకులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకుపోగా తూములకు చెక్కలు ఏర్పాటు చేయించే బాధ్యతను టీడీపీకి చెందిన చుండూరి మాలకొండయ్యకు అప్పగించారు. దీంతో ఆయన శనివారం ఒక తూముకు చెక్కను ఏర్పాటు చేయించడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మొక్కుబడిగా సహకార దినోత్సవం

గుడ్లూరు : మండల కేంద్రమైన గుడ్లూరులో సహకార దినోత్సవం మొక్కుబడిగా జరిగింది. గుడ్లూరు వెలుగు కార్యాలయం నుంచి బస్టాండ్ కూడలి వరకూ సాగిన ర్యాలీలో వెలుగు ఏపిఎంతో పాటు ఇతర అధికారులు కూడా పాల్గొనక పోవడంతో విమర్శలు వ్యక్తమయ్యాయి.

తెల్లరాయి తవ్వకాలు చేస్తే చర్యలు : తహసీల్దార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వలేటివారిపాలెం, జూలై 6: ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా అక్రమంగా తెల్లరాయి తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు తెలిపారు. మండలంలోని పోలినేనిచెరువులో 'ఎల్లలు దాటుతున్న అక్రమ తెల్లరాయి' అనే శీర్షికన ఈనెల 3న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం ఫారెస్టర్ నాగయ్య, తహసీల్దార్ నాగమల్లేశ్వరావు, ఒంగోలు, నెల్లూరు మైనింగ్ అధికారులు వేర్వేరుగా పోలినేనిచెరువులో అక్రమంగా నిల్వచేసిన తెల్లరాయిని పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నాగమల్లేశ్వరావు మాట్లాడుతూ అక్రమార్కుడికి ఫోన్ చేసి అక్రమ తెల్లరాయి నిల్వలను సీజ్ చేస్తున్నామని, తెల్లరాయిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు తెలిపారు

ఆర్‌ఎంపీ అసోసియేషన్ భవనం నిర్మాణానికి హామీ



కేఎస్ రెడ్డిని సన్మానిస్తున్న ఆర్‌ఎంపీ జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు

కోవూరు, జూలై 6: నెల్లూరు పట్టణంలో ఆర్‌ఎంపీ అసోసియేషన్ భవన నిర్మాణానికి కృషి చేస్తామని చాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ సభ్యులు కేఎస్ రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం కొత్తూరులో ఆర్‌ఎంపీ సంఘం సభ్యులు ఆయన్ను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆర్‌ఎంపీ వైద్యు లు సామాజిక బాధ్యతతో సహాయం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవీంద్రబాబు, రోజారాణి, ఉపాధ్య క్షుడు గౌస్‌బాష తదితరులు పాల్గొన్నారు.

రూ.3.1లక్షలకు చేపల వేలం

మనుబోలు, జూలై 6: కుడిచెరువు, కండలేరు కాలు వల్లో చేపలు పట్టుకునేందుకు స్థానిక పంచాయతీ కార్యా లయంలో సర్పంచు కంచి పద్మమ్మ అధ్యక్షతన శనివారం అధికారులు వేలం నిర్వహించారు. కార్యదర్శి వెంకటరమణ వేలంను ప్రారంభించగా 5గురు రూ.5వేలు చొప్పున ధరా వత్తు చెల్లించి పాటలో పాల్గొన్నారు. దువ్వూరు వెంకట రమణారెడ్డి అత్యధికంగా రూ.3.1లక్షలకు వేలం పాడి దక్కించుకున్నారు. ఆయనకు ఏడాది పాటు చేపలు పట్టు కునేలా కార్యదర్శి ధ్రువీకరణ పత్రం అందజేశారు.

ప్రపంచ జునోసిస్ దినోత్సవం



పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

పొదలకూరు, జూలై 6 : ప్రపంచ జునోసిస్ దినో త్సవం సందర్భంగా పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశా లలో శనివారం వైద్యశాల సంచాలకులు కె.అరుణ ఆధ్వ ర్యంలో అధికారులు పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ వ్యాధి నివారణ వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో రమేష్ బాబు ఎల్ఎస్ఏ, వీవీ శ్రావణ్, ఇ.ఆల్విన్, సిబ్బంది పా ల్గొన్నారు. అలాగే తాటిపర్తి పశువైద్యశాలలో జంతువుల నుంచి మనుషులకు వచ్చే వ్యాధులపై అవగాహన కల్పిం చారు. అనంతరం 30కుక్కలకు వ్యాక్సిన్ వేశారు. కార్యక్ర మంలో పశువైద్యాధికారి సీహెచ్ మురళీకృష్ణారెడ్డి, పల్ల వరపు కృష్ణ, బాలిరెడ్డి హనుమారెడ్డి, రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటాచలం: మండలంలోని పూడిపర్తి ప్రభుత్వ పాఠశాల అవరణంలో శనివారం పశువైద్య శాఖ ఆధ్వర్యం లో ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని పురష్కరించు కొని అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జంతు వుల నుండి మనుషులకు వ్యాధులు ఎలా సంక్రమి స్తాయి. వాటి నుండి ఎలా మనం జాగ్రత్తలు తీసుకోవాలన్నదా నిపై పాఠశాల విద్యార్థులకు వివరించారు. అనంతరం కుక్కలకు రేబీస్ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్యా ధికారిని డాక్టర్ ఝాన్సీరాణి, గ్రామస్తులు మోడేబోయిన రాజేష్ యాదవ్, ఈపూరు శరత్‌నాయుడు, పశువైద్య పాఠ శాల సిబ్బంది, పలువురు ఎన్డీఏ కూటమి నేతలు ఉన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 6: ప్రపంచ జంతువుల దినో త్సవాన్ని పురస్కరించుకుని శనివారం పెనుబల్లి పశువైద్య శాలలో కుక్కలకు పశువైద్య అధికారి ఆర్.శ్రీనివాసులు రేబిస్ నివారణ వ్యాక్సిన్‌ను వేశారు. ముందస్తు జాగ్రత్తగా ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

ఇందుకూరుపేట: మండలంలోని అన్ని పశువైద్యశాల లో అధికారులు వీధి, పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ వ్యాక్సిన్ వేశారు. పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నాగమణి పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. జంతువుల నుంచి మనుష్యులకు వచ్చే బర్డ్‌ఫ్లూ, రాబిస్, మెదడువాపు, ఆంత్రక్స్, టీబీ వ్యాధులు గురించి వివరించారు. కార్యక్రమంలో ఇందుకూరుపేట ప్రాంతీయ పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.మురళీకృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ బి.సురేష్, పశు వైద్యశాల ఎల్ఎస్ఏ రవి, ఏహెచ్ఏలు రమేష్, మౌనిక, సురేఖ, డీఈవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

పొదలకూరు, జూలై 6: ఆలుర్తి గ్రామానికి చెందిన నూరి అంకయ్య అనే వ్యక్తిపై శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. నావూరుపల్లి గ్రామానికి చెందిన పెంచలయ్య పొలంలో అంకయ్యకు చెందిన పశువులు మేస్తున్నాయి. తోటలో పనిచేసే రత్త య్య అనే గిరిజనుడు బయటకు తోలుతుండటంతో అంక య్య గిరిజనుడుపై దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యా దులో చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



పాదయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

తిరుపతికి అమ్మవారిపాలెం వాసుల పాదయాత్ర

● పాల్గొన్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

పొదలకూరు, నెల్లూరు, జూలై 6: నియోజకవర్గ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి గెలిస్తే తిరుపతికి పాదయాత్రగా వస్తామని అమ్మవారిపాలెం ప్రజలు వెంకన్న స్వామికి మొక్కుకున్నారు. ఆ మొక్కును తీర్చేందుకు శనివారం గ్రామం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి 200మంది తిరుపతికి బయలుదేరారు. వీరిని సాగనంపేదుకు స్వయాన ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వచ్చి జెండాఊపి వారిని సాగనంపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడారు. తన గెలుపుకోసం అహర్నిశలు పాటు పడిన వారికి పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, బక్కయ్య నాయుడు, ఆదాల సుగుణమ్మ, ఆదాల మురళీ, దేవరం అమర్‌నాథ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఇందుకూరుపేట, జూలై 6: రాబోవు వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని మండలాధ్యక్షుడు గంధల్ల శంకరయ్య సూచించారు. శనివారం స్థానిక మండల కార్యాల యంలో ఆయన అధ్యక్ష తన జరిగిన మండల సమావేశంలో ఎంపీడీవో సాయిలహరి పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఎంపీపీ మాట్లాడారు. ఈ నెల 1వ తేదీ రోజునే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపి ణీ చేశామన్నారు. గ్రామా ల్లోని ఎస్టీ కాలనీల్లో పిల్లలను బడికి పంపేలా తగు చర్య లు తీసుకోవాలని ఉపాధ్యాయులకు తెలిపారు. కార్యక్ర మంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి, మండల ఉపాధ్యక్షురాలు కైలాసం లావణ్య, సర్పంచులు, ఎంపీ టీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిహారం అందేలా చూడండి

● మాజీ ఉప రాష్ట్రపతికి చవటపాలెం వాసుల వినతి



వెంకయ్య నాయుడిని కలిసిన చవటపాలెం రైతులు

వెంకటాచలం, జూలై 6 : మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనా యుడుని శనివారం చవట పాళెం గ్రామానికి చెందిన పలువురు రైతులు, గ్రామ స్థులు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భం గా వారు మాట్లాడారు. గ్రామం సమీపం లో ఏర్పాటు చేయనున్న ఎన్‌సీఈఆర్‌టీ సంస్థకు తమ భూములు తీసుకుని ఇప్పటివరకు పరిహారం ఇవ్వలేదని వాపోయారు. దీనిపై స్పందించిన వెంకయ్యనాయుడు కలెక్టర్, సంబంధిత ఉన్నతాధికారు లతో మాట్లాడి రైతులకు సకాలంలో పరిహారం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చ కార్యదర్శి, స్థానిక రైతు ఆరుముళ్ల మురళీ, రైతులు తాళ్లూరు చిరంజీవి ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



దొడ్ల అమృతకు నగదు బహుమతి అందజేస్తున్న ఏవో పురుషోత్తం శివకుమార్

సైదాపురం, జూలై 6: కార్పోరేట్ పాఠశాలలకు దీటు గా ప్రభుత్వ పాఠ శాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్న ట్లు ఎంపీడీవో కార్యాలయం ఏవో పురుషోత్తం శివ కుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఊటుకూ రు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు ఏవో పురుషోత్తం శివకుమార్ తల్లిదండ్రులు సరోజిని, సివి పురుషోత్తంల జ్ఞాపకార్థం నగదు బహుమతులు అందజేశారు. ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గంటా పుల్లయ్య కుమారుడు గంటా శశాంక్ వారి నానమ్మ మంగమ్మ, తాతయ్య శ్రీనివాసుల జ్ఞాపకార్థం మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన దొడ్ల అమృతకు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో దయాకర్, హెచ్ఎం యస్వియస్ శర్మ, నెల్లూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారిణి ప్రసన్న లక్ష్మీ, మండల వైస్ ఎంపీపీ తిరకాల భాస్కర్, సర్పంచు పెంచలయ్య, మాజీ సర్పంచు తిరకాల నారాయణ, సెక్రటరీలు శ్రీనివాసులు, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

● వీఎస్‌యూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సునీత



మొక్కలు నాటుతున్న ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ సునీత

వెంకటాచలం, జూలై 6: అమ్మకు గుర్తుగా ప్రతి ఒక్కరూ మొక్క ను నాటి దాన్ని సంరక్షించాలని విక్రమ సింహ పురి యూని వర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ కే.సునీత పిలుపునిచ్చారు. శనివారం కాకుటూరు వీఎస్‌యూలో ఆమె మొక్కలు నాటి మాట్లాడారు. యూనివర్సిటీలో పచ్చదనం పెంపొందించడానికి నిర్విరామంగా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో చాముండేశ్వరి, డాక్టర్ సీహెచ్ సాయిప్రసాద్‌రెడ్డి, డాక్టర్ వై విజయ, డాక్టర్ హుస్సేనయ్య, సుజాఎస్ నాయర్, డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, డాక్టర్ కే విద్యాప్రభాకర్, డాక్టర్ వీ అనిల్‌కుమార్, డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

ఘనంగా వన మహోత్సవం



మొక్కలు నాటుతున్న ఎంఈవో -2 యరామనాయుడు

తోటపల్లిగూడూరు, జూలై 6: ఆములూరు పాఠశాల ఆవరణలో శనివారం మండల విద్యాధి కారి-2 జయరామనాయుడు శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగే చేపట్టిన వన మహోత్సవ కార్య క్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని మొక్కలు నాడటం సంతోషకరం అన్నారు. అనం తరం పంచాయతీ కార్యదర్శి సీహెచ్ విజయదుర్గ మాట్లాడారు. పిల్లలలో విద్యార్థి దశ నుంచే మొ క్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్‌ను నివారణపై అవగాహన కల్పించాలన్నారు. పాఠశా లకు పూలకుండీలు, మొక్కలు అందజేసిన జిల్లా కార్మికశాఖ సహాయ కమిషనర్ షేక్ గౌస్‌నకు ప్రధా నోపాధ్యాయులు షేక్ అహ్మద్‌బాషా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ ఆర్.స్వాతి, వైస్ చైర్మన్ వి.గిరిజకుమారి, ఉపాధ్యా యులు కె.వసంతలక్ష్మి పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల అవినీతిపై విచారణ చేపట్టాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకుల నిరసన

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 6: మండల కేంద్రంలోని జగనన్న కాలనీల్లోని ఇళ్ల స్థలా ల కేటాయింపు, నిర్మాణాల్లో జరిగిన అవి నీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరి పించాలని శనివారం బీజేపీ మండల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సంద ర్భంగా వారు తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు రామిశెట్టి మోహన్‌బాబు మాట్లాడారు. బుచ్చిలో కూలిపనులు చేసుకుంటూ అద్దె కొం పల్లో కాపురాలున అర్హులను గాలికొదిలేసి వైసీపీ నాయకులు చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపించారు. అనం తరం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నమామిగంగే రాష్ట్ర ప్రముఖ్ మిడతల రమేష్, కాసా శ్రీనివాసులు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల కోసం

వీఆర్సీలో మోడల్ స్కూల్

పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ



నారాయణను సత్కరిస్తున్న సోమిరెడ్డి

నెల్లూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలో కనీసం వెయ్యి మంది పేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో ఉచిత విద్య అందిం చనున్నట్లు మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రకటించారు. నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద శనివారం మీడియాతో మాట్లాడారు. 2014-19లో ము న్సిపల్ శాఖ మంత్రి హోదాలో నెల్లూరు నగరంలో పేద విద్యార్థుల కోసం మున్సిపల్ జూనియర్ కాలేజీని స్థాపించి న విషయాన్ని గుర్తు చేశారు. ఆ కాలేజీ నిర్వహణ కోసం కార్పొరేషన్ ద్వారా నిధులు ఇప్పించామని, అధ్యాపకుల జీతభత్యాల కోసం నెలకు రూ.6 లక్షల చొప్పున నారాయణ విద్యాసంస్థలు భరించాయని చెప్పారు. ఇక్కడ చదివిన వం దలాది మంది పేద విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించార న్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ కళాశాలను మూసేసిందని విమర్శించారు. నగరంలో మళ్లీ పేదల కోసం పాఠశాల, కళాశాల ప్రారంభిస్తానని మంత్రి నారాయణ పునరుద్ఘాటించారు. ఆరో తరగతి నుంచి జూనియర్ ఇంటర్ వరకు వెయ్యి మందికి తక్కువ కాకుండా విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తామ ని తెలిపారు. 300 మంది విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తామని, రానున్న విద్యా సంవత్సరం నుంచి వీఆర్ కళాశాల భవనంలో ఈ మోడల్ స్కూల్ ప్రా రంభించడానికి సన్నాహాలు చేస్తున్నామని వివరించారు.

సోమిరెడ్డితో భేటీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సర్వేపల్లి ఎమ్మె ల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ భేటీ అయ్యారు. శనివారం సాయంత్రం సోమిరెడ్డి నివాసానికి మంత్రి చేరుకున్నారు. పలు అంశాలను చర్చించా రు. సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధికి సహకరిం చాలని మంత్రిని సోమిరెడ్డి కోరారు.

జీవో 84ను రద్దు చేయాలి

నెల్లూరు(హరనాథపురం): జీవో నెంబరు 84ను రద్దుచేసి మున్సిపల్ ఎడ్యుకేషన్ డైరెక్టరే ట్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ మున్సిపల్ టీచర్ల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ధనరాజ్ రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయ ణను కోరారు. ఈ మేరకు శనివారం ఆయనను క్యాంపు కార్యాలయం లో కలిసి వినతిపత్రం అందచేశారు. మున్సిపల్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పోస్టులు మంజూరు చేయాలని వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు.

మమ్మల్ని ఆదుకోండి !

● మంత్రి నారాయణను కోరిన లైసెన్సుడ్ సర్వేయర్లు

నెల్లూరు(సిటీ), జూలై 6 : గత ప్రభుత్వం తమ ప్రతిభను, ఉపాధి అవకాశాలను నిర్వీర్యం చేయడంతో రోడ్డునపడ్డామని, తమను ఆదుకోవాలని లైసెన్సుడ్ సర్వేయర్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణను కోరారు. శనివారం మంత్రిని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందించారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు రూ. 40 కోట్లు ఖర్చు పెట్టి శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం అందించారని చెప్పారు. అదే సాకుగా వైసీపీ ప్రభుత్వం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లేకుండా చేసిందని వాపోయారు. తహసీల్దారు కార్యాలయాల్లో సహాయ సర్వేయర్లుగా తమను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నంబూరి సురేష్, తాతారావు, దయాకర్, గిరిబాబు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

నెల్లూరు(వైద్యం/హర నాథపురం), జూలై 6 : స్వాతం త్ర్య సమరయోధుడు, దేశ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ 38వ వర్ధంతి సందర్భంగా శనివారం తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాల యంలో నాయకులు ఘనంగా నివాళులర్పించారు. పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ చిన్న వయసులోనే పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికై 50 ఏళ్ల కొనసాగిన రికార్డు నెలకొల్పారన్నారు. దేశంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నన్నేసాహెబ్, మస్తానయ్య, ఇజ్రాయిల్, రమేష్, శ్రీనివాసులు, శ్రీనాథ్ పాల్గొన్నారు.

● జగ్జీవన్‌రామ్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య పిలుపునిచ్చారు. నగరంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తాటిపర్తి రఘు, పలిగిలి వెంకట రమణయ్య, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

గోషా ఆసుపత్రిని అందుబాటులోకి తేవాలి : సీపీఐ ఆందోళన

నెల్లూరు(వైద్యం), జూలై 6 : నగరంలోని గోషా ఆసుపత్రికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న గోషా ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్ మాట్లాడుతూ గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మంత్రి నారా యణ గోషా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభు త్వం ఐదేళ్ల పాలనలో ఈ ఆసుపత్రిపై నిర్లక్ష్యం చూపిందని విమర్శించారు. మళ్లీ ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం రావడంతో గోషా ఆసుపత్రి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ అహ్మద్, రైతుసంఘం జిల్లా అధ్యక్షు డు షాన్‌వాజ్, సర్తాఫ్, లతీఫ్ అహ్మద్, రియాజ్, అశోక్, వెంకటేశ్వర్లు, బాబు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జడ్పీ చైర్‌పర్సన్

నెల్లూరు(హరనాథపురం), జూలై 6 : జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ శనివారం కలెక్టరే ట్‌లో నూతన కలెక్టర్ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు శనివారం జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌ను కలిసి సత్కరించారు.

ఓవెల్ పాఠశాలలో మాక్ పోలింగ్

నెల్లూరు (విద్య), జూలై 6 : నగరంలోని అన్నమయ్య సర్కిల్‌లో ఉన్న ఓవెల్ పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పిస్తూ శనివారం మాక్ పోలింగ్ నిర్వహిం చారు. ఆ విద్యాసంస్థల డైరెక్టర్ ఆర్ వేణు మాట్లాడుతూ పారదర్శక పాలన కావాలంటే మంచి నాయకులను ఓటు ద్వారా ఎన్నుకోవాలన్నారు. దీనికోసంగా విద్యార్థుల బాధ్యతలను గుర్తు చేస్తూ వారిలో పబ్లిక్ స్పీకింగ్ స్కిల్స్ పెంచడం, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఈ కార్యక్ర మం నిర్వహించామని తెలిపారు. అనంతరం సాధారణ ఎన్నికల మాదిరిగా ఈవీఎంలను సిద్ధం చేసి 1 నుంచి 10వతరగతి వరకు విద్యార్థులకు ఓటు ఎలా వేయాలో తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో విద్యాసంస్థ సీఈవో ప్రమీల, జీఎం మహదేవ్, ఈడీ బాలు, డీజీఎం శ్రీనివాసులు, ప్రిన్సి పాల్ల రమణయ్య నాయుడు, ఎస్‌కే రఫీ, ఎంఎస్ మీనాక్షి, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యాధికారికి వీడ్కోలు సన్మానం



రాంగోపాల్‌ను సన్మానిస్తున్న వైద్యాధికారులు

నెల్లూరు(వైద్యం), జూలై 6 : వైద్య ఆరోగ్యశాఖ జిల్లా కార్యాలయం లో పనిచేస్తున్న అడ్మినిస్ట్రేటివ్ అధి కారి రాంగోపాల్‌ను మినిస్టీరియల్ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు ఘనంగా సన్మానించారు. రాంగోపా ల్ ఉద్యోగోన్నతిపై పులివెందుల వైద్య కళాశాలకు అసిస్టెంట్ డైరెక్టర్ గా బదిలీ అయ్యారు. దీంతో శనివా రం వీడ్కోలు సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎం హెచ్‌వో డాక్టర్ పెంచలయ్య మా ట్లాడుతూ ఏవోగా రాంగోపాల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని చెప్పారు. మినిస్టీరియల్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీ శ్రీకాంత్, వెంకట్ మా ట్లాడుతూ ఏవో రాంగోపాల్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాద ర్‌వలీ, డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, ఇన్‌చార్జి ఏవో డాక్టర్ వెంకటేశ్వర్లు, మినిస్టీరియల్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాని ఫొటో ఉండాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 6: జిల్లా వ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాల యా ల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని బీజేవైఎం నాయకు లు శని వారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌కు వినతి పత్రం అందజేశారు. బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లూరు నవీన్ కుమార్, మురుగా సురేష్ మాట్లాడుతూ తమ అభ్య ర్థనకు జాయింట్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, త్వరితగతిన ప్రధాని చిత్రపటాన్ని ఏర్పా టు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌నగర్ మండ ల అధ్యక్షుడు ధర్మాసనం వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

కేఎన్‌ఆర్ పాఠశాలలో వసతులు మెరుగుపరుస్తాం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 6: పేదల విద్యాప్రదాయిని అయిన బీవీనగర్‌లోని కేఎన్‌ఆర్ మున్సిపల్ హైస్కూల్లో వసతులు మెరుగుపరుస్తామని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ తెలిపారు. శనివారం ఆ పాఠశాలను జనసేన నాయకులు సందర్శించా రు. విద్యార్థులను, ఉపాధ్యాయులను అడిగి పాఠశాలకు కావాల్సిన మౌలిక వసతు ల గురించి తెలుసుకున్నారు. కిషోర్ మాట్లాడుతూ నాలుగు సార్లు రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన పాఠశాలలో ఆరుబయట పాఠాలు చెప్పుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇక్కడి పరిస్థితులను మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్ గౌడ్, హేమచంద్ర యాదవ్, మౌనిష్, ఇషాక్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేట్ల వద్ద బాక్స్‌టైప్ బ్రిడ్జీలు నిర్మించండి : కోటంరెడ్డి

నెల్లూరు రూరల్, జూలై 6 : నగరంలోని కొండాయపాళెం, కరెంటాఫీసు రైల్వే గేట్ల వద్ద బాక్సు టైప్ వంతెనలు నిర్మించాలని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి రైల్వే అధికారులను కోరా రు. శనివారం నెల్లూరుకు వచ్చిన రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ రమణారావుకు వినతిపత్రం అంద చేశారు. ఆ లెవల్ క్రాసింగుల వద్ద నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోందని, ఈ క్రమంలో బాక్సు టైప్ బ్రిడ్జీలు త్వరతిగతిన నిర్మించాలని కోరారు.

రేపు విద్యుత్ అదాలత్

నెల్లూరు (జడ్పీ), జూలై 6: నెల్లూరు నగర డివిజన్‌కు సంబంధించి విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు సోమ వారం ప్రత్యేక అదాలత్ నిర్వహిస్తున్నామని ఈఈ సోమ శేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక అధ్యక్షుడు శ్రీనివాస ఆంజనేయ మూర్తి, ఆర్థిక సభ్యుడు రామ్మోహన్ రావు, సాంకేతిక సభ్యుడు అంజనీకుమార్ హాజరవుతారని తెలిపారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో సోమవారం ఉద యం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అదా లత్ ఉంటుందని, దీనిని వినియో గదారులు సద్వినియో గం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు (జడ్పీ), జూలై 6: నగరంలోని ఆటోనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్లకు మరమ్మతులు చేస్తున్నందున ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఈఈ సోమశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉడ్ కాంప్లెక్స్, డ్రైవర్స్ కాలనీ, విక్రమ్ నగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని, దీనిని వినియోగదారులు గుర్తించాలని కోరారు.

సఫాయి కర్మాచారి కమిషన్ సభ్యుడిని కలిసిన బీజేపీ నేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 6: అధికారిక పర్యటనలో భాగంగా నెల్లూరుకు విచ్చేసి న జాతీయ సఫా యి కర్మాచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ వావాను శనివారం నగరంలోని ఓ హోటల్‌లో బీజేపీ నాయకులు మర్యాదపూ ర్వకంగా కలిశారు. కార్యక్రమంలో భైరి శ్రీనివాస్, పరుసు వెంకటేశ్వర్లు, పరుసు మధు, నటుకులు కిషోర్ కుమార్, జరుగుమల్లి జయకుమార్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మంత్రి ఆనంకు అభినందనలు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 6 : రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా నాయీబ్రాహ్మణ ఎంప్లాయీ స్ సొసైటీ కార్యనిర్వాహక కమిటీ అభినందనలు తెలిపింది. శనివారం మంత్రిని క్యాంపు కార్యాలయంలో కలిసి సన్మా నించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు, కోశాధికారి ఆర్ ప్రభాకర్‌రావు, ఉపాధ్యక్షులు వల్లూరు బాలకేశవులు, హరజత్తయ్య, మోమి డి పుల్లయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సరుకులు అక్రమంగా నిల్వచేస్తే చర్యలు : జేసీ

నెల్లూరు(హరనాథపురం), జూలై 6 : సరుకులను అక్రమంగా నిల్వచేస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ హెచ్చరించారు. శనివారం ఆయన చాంబ ర్‌లో ధరల నియంత్రణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అక్రమ నిల్వలపై దృష్టి సారించాలన్నారు. నిత్యావసర వస్తువులు దారి మళ్లకుండా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిర్ణీ త ధరలకే నిత్యావసరాలను విక్రయించాలని మిల్లర్లకు, వర్తకులకు సూచించారు. ఈ సమావేశంలో డీఎస్వో రమ ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

నెల్లూరు(క్రైం), జూలై 6: నెల్లూరులోని వేదాయపా లెం రైల్వేస్టేషన్‌లో శనివారం రాత్రి రైలు నుంచి జారిపడి ఓ యువకుడు మృతిచెందాడు. రైల్వే పోలీసుల సమాచా రం మేరకు.. నగరంలోని గాంధీనగర్‌లో సలీం కుటుంబం నివసిస్తోంది. ఆయన కుమారుడు నాసీర్(22) నాయుడు పేటలోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం సాయంత్రం నాయుడుపేట నుంచి హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో నెల్లూరుకు బయలుదేరాడు. వేదాయపాళెం రైల్వే స్టేషన్‌లో ప్రమాదవశాత్తు రైలు నుంచి ప్లాట్‌ఫామ్‌పై జారిపడటంతో తలకు తీవ్రగాయమైంది. దీంతో అక్కడికక్క డే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ జీ మాలకొండయ్య ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహా న్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మా ర్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


పరిశుభ్రతకు సహకరించండి : ఎంహెచ్‌వో

నెల్లూరు(సిటీ), జూలై 6 : కొనుగోలుదారులను ఆక ర్షించేవిధంగా పండ్ల మార్కెట్‌ను సుందరంగా తీర్చిదిద్దుకో వాలని ఎంహెచ్‌వో డాక్టర్ వెంకట రమణయ్య వ్యాపారుల కు సూచించారు. శనివారం నగరంలోని పండ్ల మార్కెట్ వ్యాపారుల సంఘం కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. మార్కెట్ వద్ద డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసి వ్యర్థాలు రోడ్లపై పోయడాన్ని నియంత్రించాలన్నారు. వ్యా పారుల సహకారంతో మార్కెట్‌ను అందంగా ఆకర్షణీయం గా తీర్చిదిద్దేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. చెత్త వాహనాలకు మాత్రమే దుకాణదారులు వ్యర్థాలను అందించాలని చెప్పారు.

క్యాప్ బాలలకు విద్యాసామగ్రి పంపిణీ

నెల్లూరు (విద్య), జూలై 6 : నగరంలోని కొండా యపాళెం గేటు సమీపంలో ఉన్న చైల్డ్ అండ్ పోలీస్ (క్యాప్) ప్రాజెక్ట్ బాలుర హాస్టల్‌లోని విద్యార్థులకు అనంత సాగరం మండలం రేవూరు గ్రామానికి చెందిన కలువాయి యల్లారెడ్డి శనివారం విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఆ యన మాట్లాడుతూ పేద విద్యార్థులకు తనవంతు సహా యం అందించేందుకు నోటు పుస్తకాలు, అట్టలు, పెన్ను లు, పలకలు, పెన్సిళ్లు అందచేశామన్నారు. ముందు ముందు మరింత సహాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
ఆదివారం 7 జులై 2024



ఆదివారం ప్రత్యేకం



లైబ్రరీ బస్సు



ఆర్టీసీ బస్సును కదిలే లైబ్రరీగా మార్చేశాడు ఒక చిన్న ఉద్యోగి. తిరుపతి- మదనపల్లె మధ్య నడుస్తున్న ఆ బస్సు ఎక్కగానే పుస్తకప్రయాణానికి స్వాగతం అనే బోర్డు ఆహ్వానిస్తుంది. మద్యపానం గురించి, పుస్తక పఠనం గురించి మంచి మాటలు బస్సులో కనిపిస్తాయి. లోపలికి అడుగుపెట్టగానే వేలాడుతున్న గుడ్డ ర్యాక్‌లో రకరకాల పుస్తకాలుంటాయి. ప్రయాణికులు చదువుకుని దిగేటప్పుడు అందులో పెట్టేయవచ్చు. ఈ బస్సులో తిరుపతి- తిరుమల ప్రత్యేకత, మదనపల్లి విశేషాలు కూడా చార్టుల్లో ముద్రించి వేలాడదీశారు. ఈ మార్పులకు కారణం ఆ బస్సు డ్రైవర్ గుంపు రఘుకుమార్ అనే యువకుడు. తెలుగుభాషాభిమాని. సాహిత్యాభిలాషి. మదనపల్లి- తిరుపతి నడుమ ప్రయాణానికి మూడు గంటల సమయం పడుతుంది. బస్సు ఎక్కగానే ప్రయాణికులంతా సెల్‌ఫోన్ చేతుల్లోకి తీసుకుని ఎవరి ప్రపంచంలో వారు మునిగిపోతున్నారు.కనీసం పక్కవారితో కూడా మాటలు కలపడం లేదు. ఈ పరిస్థితిని చూసిన రఘుకుమార్ బస్సులోకి పుస్తకాలు చేర్చారు.ఆసక్తి ఉన్నవారిని చదవమని చెబుతుంటారు. ప్రయాణికుల్లో నిదానంగా పుస్తకాలు చేతికి తీసుకునేవారి సంఖ్య పెరిగింది. ఇందువల్ల మొబైల్స్ జేబుకే పరిమితం అవుతున్నాయి. చరిత్ర, వర్తమాన సమాచారం, కథలు, మనోవిజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై 30 పుస్తకాలు ఎప్పుడూ ఈ బస్సులో అందుబాటులో ఉంటాయి. ఇవన్నీ ఆయన సొంత ఖర్చుతోనే ఏర్పాటుచేయడం విశేషం. ఈ లైబ్రరీ బస్సు గురించి తెలిసి తిరుపతి జిల్లా రచయితల సంఘం ప్రతినిధులు సాకం నాగరాజ, వాకా ప్రసాద్ శుక్రవారం దీనిని సందర్శించారు. డ్రైవర్ రఘుకుమార్‌ను అభినందించారు. కొన్ని పుస్తకాలను, కొత్త పుస్తకాల కోసం కొంత నగదును అందజేశారు. వీరిని చూసి ఒక ప్రయాణికురాలు కూడా పుస్తకాలు కొనమని కొంత నగదు ఇచ్చారు.

- తిరుపతి (కల్చరల్)





తిరుపతి జిల్లాకు నాలుగవ కలెక్టర్‌గా వచ్చారు డాక్టర్ సంజామల వెంకటేశ్వర్. ప్రకాశం జిల్లా కొమరోలు మండలం ఇడమకల్లు ఆయన పుట్టిన ఊరు. 2017లో ట్రైనీ కలెక్టర్‌గా అనంతపురం జిల్లాలో పనిచేశారు. పాడేరు సబ్ కలెక్టర్‌గా, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా చేశారు. కొవిడ్ సమయంలో విశాఖ జిల్లా నోడల్ అధికారిగా సేవలందించారు. హౌసింగ్ జేసీగా చిత్తూరుకు వచ్చిన వెంకటేశ్వర్ ఆ తర్వాత జాయింట్ కలెక్టర్‌గా ఏడాదిన్నర పాటు కొనసాగారు. వైద్య శాఖలో సెకండరీ హెల్త్ విభాగం డైరెక్టర్‌గా, వైద్యారోగ్య శాఖ కమిషనర్‌గా చేస్తూ కలెక్టర్‌గా తిరుపతికి వచ్చారు. గ్రామీణ ప్రాంతం నుంచి ఐఏఎస్ దాకా తన ప్రయాణాన్నీ.. కొత్త బాధ్యతల్లో తన ప్రాధాన్యాలనూ ఆంధ్రజ్యోతికి వివరించారు.



■ ఇంటర్వ్యూ

డాక్టర్ సంజామల వెంకటేశ్వర్

పుట్టిన తేది: ఏప్రిల్ 4, 1989

కుటుంబం: తల్లిదండ్రులు వెంకటయ్య, కాశమ్మ. భార్య సించన. కుమార్తె హన్విక. అన్న, ముగ్గురు అక్కలు.

చదువు: ప్రైమరీ, హైస్కూలు గుంటూరు లయోలా పబ్లిక్ స్కూలులో. ఇంటర్ వైజాగ్ శ్రీ చైతన్యలో. మెడిసిన్ వైజాగ్ ఆంధ్రా మెడికల్ కాలేజిలో.

చిన్ననాటి కోరిక:

"ప్రకాశం జిల్లా కొమరోలు మండలం ఇడమకల్లు మా స్వస్థలం. నాన్న వెంకటయ్య మిలిటరీలో 13 ఏళ్ళు పనిచేసి రిటైరయ్యారు. అమ్మ కాశమ్మ గృహిణి. నాన్న మిలిటరీ నుంచీ వచ్చాక వ్యవసాయం చేసేవారు. పంచాయతీ సర్పంచుగా, కొమరోలు జడ్పీటీసీ సభ్యుడిగా కూడా పనిచేశారు. ఆయన వెంట అప్పుడప్పుడూ ఒంగోలు కలెక్టరేట్‌కు వెళ్ళేవాడిని. ఎప్పటికైనా కలెక్టర్ కావాలనే కోరిక అప్పుడు నాటుకున్నదే.విశాఖ ఆంధ్రా మెడికల్ కళాశాలలో మెడిసిన్ చేస్తున్నపుడు ఎదురుగానే కలెక్టరేట్ వుండేది. కింగ్ జార్జి ఆస్పత్రికి అప్పట్లో విశాఖ కలెక్టర్ శ్యామలరావు (ప్రస్తుత టీటీడీ ఈవో) తనిఖీలకు వచ్చేవారు. ఆ సమయంలో అధికారులు, ఉద్యోగుల హడావిడి చూశాక కలెక్టర్ కావాలన్న చిన్నప్పటి కోరిక మరింత బలపడింది. అందుకే మెడిసిన్ పూర్తి కాగానే హైదరాబాదు, ఢిల్లీలలో సివిల్స్ కోచింగ్ తీసుకున్నా. కల సాకారం చేసుకున్నా. కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ అందుకుని తిరుపతికి వచ్చా. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమల వెంకటేశ్వరస్వామి కొలువైన జిల్లాకు కలెక్టర్‌గా రావడాన్ని అదృష్టంగా భావిస్తున్నా."

"2012లో హైదరాబాదులో ఆరు నెలలు, తర్వాత ఢిల్లీలో ఆరు నెలలు కోచింగ్ తీసుకున్నా. 2013లో తొలి ప్రయత్నంలో 806వ ర్యాంకు వచ్చింది. ఇండియన్ రైల్వే అకౌంట్స్ సర్వీసుకు ఎంపిక కావడంతో అందులో చేరా. ఓవైపు శిక్షణ తీసుకుంటూనే 2014లో రెండవ సారి మళ్ళీ సివిల్స్ రాస్తే 889వ ర్యాంకు వచ్చింది. ఆ ర్యాంకుతో ఐడీఈఎస్ (రక్షణ శాఖ)లో అవకాశం వచ్చినా చేరలేదు. 2015లో మూడోసారి మరింత బాగా ప్రిపేర్ అయి సివిల్స్ రాసి 216వ ర్యాంకుతో ఐఏఎస్ సాధించా."

కొత్త కలెక్టర్ ప్రాధాన్యాలు

పరిశ్రమలు పర్యాటకం

తొలి ప్రాధాన్యం

జిల్లాకు జాతీయ రహదారులు, రైల్వేలు, విమానయానపరంగా ఇతర ప్రాంతాలతో కనెక్టివిటీ బాగుంది. దానికి తోడు జిల్లాలో ఏడు మున్సిపాలిటీలున్నాయి. శ్రీసిటీ, మేనకూరు సెజ్‌లు, ఎలక్ట్రానిక్ మ్యానుఫాక్చరింగ్ యూనిట్లు రెండు, అలాగే ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కులు వున్నాయి. వీటిలో అనేక పరిశ్రమలు వున్నాయి. చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్, వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ రెండూ జిల్లా పరిధిలో వుండడం వరంగా భావించాలి. ఈ రెండు కారిడార్లకు, అలాగే చెన్నై నగరానికీ చేరువగా వున్నందువల్ల పెద్ద ఎత్తున పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలున్నాయి. వస్తు ఉత్పత్తి పరిశ్రమలతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాల్సి వుంది. అప్పుడే జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. దానికనుగుణంగా జిల్లా ప్రజల తలసరి ఆదాయం పెరగడానికి అవకాశం ఏర్పడుతుంది. ఆ దిశగా చర్యలు తీసుకోవడానికి తొలి ప్రాధాన్యత ఇస్తా.

విద్యా, వైద్య కేంద్రంగా మరింత ప్రచారం

రాష్ట్రంలో విజయవాడ, గుంటూరు తర్వాత తిరుపతే విద్యారంగానికి ప్రధాన కేంద్రంగా వుంది. విజయవాడ, గుంటూరుల్లో లేని అరుదైన, జాతీయస్థాయి ప్రతిష్ఠాత్మక సంస్థలు ఇక్కడ వున్నాయి. ఐఐటీ, ఐసర్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కలినరీ, స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, ఐఐడీటీ వంటివి వున్నాయి. వీటిలో కలినరీ, హోటల్ మేనేజ్‌మెంట్ సంస్థల గురించి పెద్దగా ప్రచారం లేదు. సాధారణ వర్శిటీలతో పాటు వేదిక్ వర్శిటీ, హార్టికల్చర్ వర్శిటీ, సంస్కృత విద్యాపీఠం వంటివీ ఉన్నాయి. వైద్యపరంగానూ రుయా, స్విమ్స్, బర్డ్, ఆయుర్వేదిక్ వంటి ఉన్నతస్థాయి ఆస్పత్రులు, పలు మెడికల్ కళాశాలలున్నా ప్రాచుర్యం లేదు. వైద్య అవసరాలకు, వైద్య విద్యార్జనకు ఇక్కడికి దేశవ్యాప్తంగా ప్రజలు, విద్యార్థులు వచ్చేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. ఆ దిశగా ప్రయత్నిస్తా.

హెరిటేజ్-ఎకో టూరిజం

తిరుపతి, తిరుమల వచ్చే యాత్రికులు ప్రధానంగా శ్రీవారి దర్శనం చేసుకుని వెనుదిరుగుతున్నారు. ఒక రాత్రి మాత్రమే జిల్లాలో గడిపి రెండవ రోజు తిరుగుప్రయాణమవుతున్నారు. తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న వారిలో అతి తక్కువమంది మాత్రమే తిరుచానూరు, శ్రీకాళహస్తి వెళుతున్నారు. కొందరు కాణిపాకం వెళ్తున్నారు.ఈ సంఖ్య గణనీయంగా పెరగాల్సి వుంది. తిరుమల వచ్చిన యాత్రికులు కనీసం రెండు రాత్రిళ్ళు జిల్లాలో బస చేసేలా చేయాలి. తిరుపతిలో కపిలతీర్థం, కోదండరామాలయం,గోవిందరాజస్వామి ఆలయం, గంగమ్మ గుడి వంటి ముఖ్య ఆలయాలు, రీజనల్ సైన్స్ సెంటర్, జూ పార్కు వంటి పిల్లలను ఆకర్షించే దర్శనీయ స్థలాలున్నాయి. చుట్టుపక్కల నారాయణవనం, నాగలాపురం, గుడిమల్లం, అప్పలాయగుంట, తొండమనాడు, సురుటుపల్లి వంటి పేరున్న ఆలయాలున్నాయి. ఇక పర్యావరణపరంగా చూస్తే జిల్లాలో తలకోన మొదలుకుని ఉబ్బలమడుగు, కైలాసకోన, సదాశివకోనతో పాటు శేషాచల అడవుల్లో అనేక జలపాతాలు, అటవీ ప్రాంతాలున్నాయి. చంద్రగిరి కోట గురించి చెప్పక్కర్లేదు. సముద్రతీరం వున్నందున బీచ్ టూరిజానికి అనుకూలం. వీటన్నింటినీ కలుపుకుని హెరిటేజ్-ఎకో టూరిజం ప్రాజెక్టులు అభివృద్ధి చేస్తే జిల్లాకు ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. ఈ రంగాలపై ప్రధానంగా దృష్టి సారిస్తా. ప్రకృతి అంటే నాకు చాలా ఇష్టం. జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో నారాయణవనం చుట్టుపక్కల అనేక జలపాతాలకు ట్రెక్కింగ్ చేశా. జిల్లా ప్రజలకు తెలియని జలపాతాలు కూడా చాలా వున్నాయి. వీటి అభివృద్ధి కోసం ఎకో టూరిజం ప్రాజెక్టులు రూపొందించాల్సిన అవసరముంది.

ఆక్వా అభివృద్ధికి ప్రణాళికలు

జిల్లాలో అటు ఆక్వా ఉత్పత్తులపరంగానూ, ఇటు టూరిజంపరంగానూ అభివృద్ధికి అపారమైన అవకాశాలున్నాయి. గూడూరు నియోజకవర్గ పరిధిలో రొయ్యల చెరువులు అధికంగా వున్నాయి. 2014-19 నడుమ అప్పటి సీఎం చంద్రబాబు ఆక్వా రంగానికి ప్రాధాన్యత ఇవ్వడంతో దేశంలోనే అత్యధికంగా ఏపీ 27 శాతం అభివృద్ధిని అప్పట్లో నమోదు చేసింది. ఇపుడు చంద్రబాబు సీఎంగా వున్నందున జిల్లాలో చేపలు, రొయ్యలు వంటి ఆక్వా ఉత్పత్తుల అభివృద్ధికి అవసరమైన ప్రాధాన్యత ఇవ్వనున్నారు. దీనిపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి సవివరమైన నివేదిక, ప్రణాళికలు అందజేస్తా.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

నేలకు దిగనున్న ఇసుక ధరలు



జిల్లాలో ఐదు స్టాక్ పాయింట్లు ● రేపటినుంచి పంపిణీ ● రోజుకు ఒకరికి 20 టన్నులు మాత్రమే!

తిరుపతి(కలెక్టరేట్)/తిరుపతి, జులై6(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ళుగా నింగికెక్కిన ఇసుక ధరలు రేపటి నుంచీ నేలకు దిగనున్నాయి. ఎన్నికల ప్రచారంలో టీడీపీ అధినేత చంద్రబాబు ఇసుకను ఉచితంగా అందజేస్తామన్న హామీకి అనుగుణంగా కొత్త ప్రభుత్వం ఇసుకపై నూతన విధానాన్ని రూపొందించింది. ప్రాథమికంగా స్టాక్ పాయింట్ల నుంచీ ఇసుకను వినియోగదారులకు అందించేందుకు విధివిధానాలను ప్రకటించింది.స్టాక్ పాయింట్ నిర్వహణకు, లోడింగ్‌కు అయ్యే ఖర్చు వంటి వాటికి మాత్రమే వినియోగదారులు ప్రభుత్వానికి డబ్బు చెల్లించాలని స్పష్టం చేసింది. ఇది నామమాత్రపు ధరేనని,రవాణా ఖర్చు మాత్రం వినియోగదారులు భరించాల్సి వుంటుందని ప్రకటించింది. మొత్తం మీద గత ఐదేళ్ళుగా రూ. 5 వేల నుంచీ రూ. 6 వేల వరకూ పలికిన ఇసుక లోడు ధర ఇపుడు ప్రజలకు అందుబాటులోకి రానుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం జిల్లాకు సంబంధించిన ఇసుక లభ్యత, స్టాక్ పాయింట్ల వివరాలు, నిర్ణయించిన ధరల వివరాలను కలెక్టర్ వెంకటేశ్వర్ సీఎస్‌కు వివరించారు.

ఐదు స్టాక్ పాయింట్లలో ధరలిలా...

జిల్లాలో సోమవారం నుంచీ ఐదు స్టాక్ పాయింట్లు జనానికి అందుబాటులోకి రానున్నాయి. శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలోని సుబ్బానాయుడు కండ్రిగ వద్ద రెండు , పిచ్చాటూరు మండలం ఏకే బీడు వద్ద ఒకటి, దొరవారిసత్రం మండలం మామిళ్ళపాడులో ఒకటి, వెంకటగిరి మండలం మొదులుగుంటలో ఒకటి చొప్పున ఐదు స్టాక్ పాయింట్లను జిల్లా యంత్రాంగం గుర్తించింది. వీటిని సోమవారం నుంచీ తెరవనున్నారు. ఉదయం 6 నుంచీ సాయంత్రం 6 దాకా స్టాక్ పాయింట్లలో ఇసుక బట్వాడా జరుగుతుంది.సుబ్బానాయుడు కండ్రిగ, ఏకే బీడుల్లోని మూడు స్టాక్‌పాయింట్లలో టన్ను ఇసుకకు రూ. 200 చొప్పున ప్రభుత్వానికి చెల్లించాలి. మామిళ్ళపాడు వద్ద రూ. 465 చొప్పున, మొదులుగుంట స్టాక్ పాయింట్‌లో టన్నుకు రూ. 590 వంతున చెల్లించాలి.ఆధార్ కార్డు ప్రాతిపదికగా రోజుకు ఒక వ్యక్తికి గరిష్ఠంగా 20 టన్నుల ఇసుక మాత్రమే స్టాక్ పాయింట్‌లో కేటాయించనున్నారు. అంటే ట్రాక్టర్ లోడ్ ప్రాతిపదిక తీసుకుంటే రోజుకు ఐదు లోడ్‌ల ఇసుక మాత్రమే ఒకరు పొందడానికి వీలవుతుంది.ఇసుక ధరల చెల్లింపునకు ప్రభుత్వం డీఎంజీ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. వెబ్‌సైట్‌లోని క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి డిజిటల్ పేమెంట్(ఫోన్‌పే, పేటీఎం, గూగుల్‌పే) ద్వారా చెల్లించి స్టాక్ పాయింట్ వద్ద రశీదు చూపిస్తే ముందు వచ్చిన వారికి ముందుగా అన్న ప్రాతిపదికన ఇసుక కేటాయింపులు జరుగుతాయి.ఇసుక ద్వారా వచ్చిన ఆదాయం కూడా స్థానిక సంస్థలకే జమ కానుంది.

అందుబాటులో 2లక్షల మెట్రిక్ టన్నులు

జిల్లాలో సుమారు 2లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. నాయుడుపేట పరిధిలోని కూచివాడలో సుమారు 5లక్షల క్యూబిక్ మీటర్ల టన్నుల ఇసుక తవ్వకాలకు మైనింగ్ అధికారులు రీచ్‌లను గుర్తించారు. పర్యావరణ అనుమతులు రాగానే ప్రజావసరాలకు కావాల్సిన ఇసుక అందుబాటులోకి రానుంది.

గ్రామ ప్రజల అవసరాలకు ఉచితమే... యంత్రాలకు నో ఎంట్రీ

గ్రామ పంచాయతీల పరిధిలోని వాగులు వంకల్లో ఇసుక తీత, లోడింగ్ వంటి వాటికి యంత్రాలు వాడకూడదని ప్రభుత్వం సూచించింది. గ్రామప్రజల అవసరాల నిమిత్తం ఇసుకను ఉచితంగా వినియోగించుకోవచ్చు. అయితే ఇసుక వ్యాపారులు ఎవరైనాసరే అక్రమంగా ఇసుక తరలించినా డంపింగ్ చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని అధికారులు హెచ్చరించారు. దీనిపై పోలీసులు,సెబ్, రెవెన్యూ శాఖలు ప్రత్యేక దృష్టి పెట్టనున్నాయి.

లెక్క తప్పిన లెక్కలయ్యోరు!

నిబంధనలకు విరుద్ధంగా రెండు వేతనాలు, డిప్యుటేషన్



మాజీ ఎమ్మెల్యే భూమనతో సురేష్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 6:ఎస్వీయూ క్యాంపస్ స్కూల్లో ఓ లెక్కల మాస్టారు లెక్క తప్పారు.టైం స్కేల్ ప్రాతిపదికన ఉపాధ్యాయుడిగా చేరిన సురేష్‌రెడ్డి వైసీపీ ప్రభుత్వ హయాంలో యూనివర్సిటీలో చక్రం తిప్పారు.తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి వద్ద పీఏగా, తరువాత ఓఎస్డీగా పనిచేశారు.ఇటు క్యాంపస్ స్కూల్ టీచర్‌గా వేతనం పొందుతూనే పీఏగా కొంతకాలం, ఓఎస్డీగా కొంతకాలం వేతనాలు పొందినట్టు సమాచారం. ఆర్థిక ప్రయోజనాలతో పాటు యూనివర్సిటీ పాలన కూడా సురేష్‌రెడ్డి కనుసన్నల్లోనే సాగింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో మళ్ళీ సురేష్‌రెడ్డి మాస్టారు స్థానానికి వచ్చేశారు. కొందరికి పదవులు, ఉద్యోగాలు ఆశచూపి డబ్బులు కాజేశాడనే విమర్శలను ఆయన ఎదుర్కొంటున్నారు. 2019 ఎన్నికల్లో కరుణాకర రెడ్డికి పోస్టల్ బ్యాలెట్ల విషయంలో సురేష్‌రెడ్డి కీలకపాత్ర పోషించినట్టు ప్రచారం జరిగింది. పీలేరు ప్రాంతానికి చెందిన సురేష్‌రెడ్డి ఎస్వీయూ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీధర్ రెడ్డికి బావ మరిది. రిజిస్ట్రార్ పదవి ప్రొఫెసర్ శ్రీధర్‌రెడ్డికి దక్కేందుకు అప్పట్లో సురేష్‌రెడ్డి అంతా తానై పని చేసినట్టు ప్రచారం సాగింది. సురేష్‌రెడ్డి సోదరి ప్రొఫెసర్ సునీత ప్రస్తుతం యూనివర్సిటీ జువాలజీ విభాగంలో అధ్యాపకురాలిగా ఉన్నారు.2024లో అధ్యాపకులకు ఇచ్చిన కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీఏఎస్) ఇంటర్వ్యూల్లో కనీసం జాయినింగ్ రిపోర్టు కూడా ఇవ్వకుండానే ప్రొఫెసర్ సునీత అమెరికాలో ఉన్నట్టు ఆరోపణలు వినిపించాయి.ఒక ఉపాధ్యాయుడు ప్రజాప్రతినిధులకు పీఏగా, పీఎస్‌గా, ఓఎస్డీగా వెళ్ళడానికి న్యాయపరమైన అభ్యంతరాలున్నట్టు యూనివర్సిటీలో చర్చ నడిచింది. అయితే, సీఎం జగన్‌కు సమీప బంధువు, అప్పట్లో రెక్టార్‌గా ఉన్న ప్రొఫెసర్ సుందరవల్లి అండతో నిబంధనలను అధిగమించి అప్పటి ఎమ్మెల్యే వద్ద పీఏగా వెళ్ళేందుకు అనుమతి తీసుకున్నట్టు చెబుతున్నారు.ఉన్నతాధికారుల అనుమతితో డిప్యుటేషన్‌పై వెళ్ళినప్పుడు తిరిగి చేరేటప్పుడు కూడా అధికారిక అనుమతి తీసుకోవలసి ఉంటుందని, అయితే అదేం లేకుండానే మ్యాథ్స్ టీచర్‌గా సురేష్‌రెడ్డి తిరిగి క్యాంపస్ స్కూల్లో విధుల్లో చేరినట్టు సమాచారం.క్యాంపస్ స్కూల్లో టీచర్‌గా విధులు నిర్వహించకనే ఎలా వేతనం పొందుతారనే ప్రశ్న తెరమీదకు వస్తోంది.

టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్‌గా విజయలక్ష్మి

తిరుమల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్‌గా విజయలక్ష్మి నియమితులయ్యారు.ప్రస్తుతం ఎస్టేట్ ఆఫీసర్‌గా ఉన్న మల్లికార్జున పరకామణి ప్రత్యేకాధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న క్రమంలో ఆయన్ను పరకామణికి పరిమితం చేశారు.రిటైర్డ్ అధికారిని ఎస్టేట్ ఆఫీసర్ స్థానంలో కొనసాగిస్తున్నారనే విమర్శలొచ్చిన నేపథ్యంలో ఆయన స్థానంలో తిరుపతిలోని శ్వేతలో విధులు నిర్వహిస్తున్న విజయలక్ష్మిని నియమించారు. తిరుమల హెల్త్‌ఆఫీసర్‌గా ఉన్న శ్రీదేవి స్థానంలో తిరుపతిలో అదనపు హెల్త్‌ఆఫీసర్‌గా ఉన్న సునీల్‌కుమార్‌ను నియమించారు. ఇటీవల తిరుమలలో పారిశుధ్య వైఫల్యంపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. తరచూ పరిశుభ్రతపై విమర్శలు వస్తున్న క్రమంలో హెల్త్‌ఆఫీసర్‌గా ఉన్న శ్రీదేవి కూడా బదిలీకోసం వినతిపత్రాన్ని అందజేశారని, ఈ క్రమంలో ఈవో ఆమోదం తెలపడంతో సునీల్‌కుమార్‌ను నియమించినట్టు సమాచారం.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

చట్టాలపై ప్రజలకు అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి అనుషా

వెంకటగిరి, జూలై 6 : చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి వుండాలని వెంకటగిరి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి, లోక్ అదాలత్ చైర్‌పర్సన్ అనూష పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొన్ని ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ చట్టబద్ధంగా జీవించడం అలవరుచుకోవాలని సూచించారు. మహిళల ప్రత్యేక చట్టాలు, హక్కులు గురించి విద్యార్థులకు వివరించారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు ఎవరు పాల్పడినా శిక్షర్హులని చెప్పారు. ఎవరైనా న్యాయం కోసం పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినప్పుడు బాధితుల ఫిర్యాదులు స్వీకరించకుండా వుంటే నేరుగా న్యాయస్థానానికి వచ్చి అర్జీ రూపంలో దాఖలు చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు దుగ్గి రాజారావు, గాంధీ,రాజేష్ పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు ఉచితంగా టీకాలు


పెంపుడు జంతువులకు రేబిస్ టీకా వేస్తున్న డాక్టర్ సురేష్

గూడూరు, జూలై 6: స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో శనివారం జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాధి సోకుండా ఉండేలా టీకాలను వేసినట్లు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ సురేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు జంతువుల నుంచి మనుషులకు కానీ, మనుషుల నుంచి పెంపుడు జంతువులకు కానీ సంక్రమించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులు అంటారన్నారు. పెంపుడు జంతువుల యజమానులు వాటి ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు వహించి వైద్యుల సూచనల మేరకు టీకాలు వేయించడం వలన ఆరోగ్యంగా ఉంటారన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు


ప్రోత్సాహం అందుకున్న విద్యార్థులతో కాపు, బలిజ సంఘం నాయకులు

చిల్లకూరు, జూలై 6: చింతవరం ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన 9 మంది విద్యార్థులకు శనివారం కావలి పట్టణానికి చెందిన కాపు, బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. హెచ్ఎం శివసుబ్రమణ్యం మాట్లాడుతూ కాపు, బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తమ పాఠశాలలో 10వ తరగతిలో 500 పైగా మార్కులు సాధించిన 9 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున నగదు ప్రోత్సాక బహుమతులు అందజేశారన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు తోట వెంకటశేషయ్య, నాగేశ్వరరావు, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి


జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చిల్లకూరు, జూలై 6: మండలంలోని ఉడతావారిపాళ్లపల్లెలో శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ జగ్జీవన్‌రామ్ యువజన సంఘం, ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో డాక్టర్ జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ ఉప ప్రధానిగా ఉన్న సమయంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో రవి, వెంకటరమణయ్య, శ్రీనివాసులు, నాగేశ్వరరావు, వాసు, సురేష్, పెంచలయ్య, సుబ్బారావు, కుబేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

నిత్య పూజావిధానంపై చాగంటి ప్రవచనాలు


నిత్య పూజావిధానంపై ప్రవచిస్తున్న చాగంటి

నాయుడుపేట టౌన్, జూలై 6 : భగవంతుడి కరుణ, కృప, కటాక్షాల కోసం నిత్య పూజావిధానంలో చేపట్టాల్సిన పూజా కార్యక్రమాలను బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు వివరించారు. నాయుడుపేట కేఎంఆర్ కన్వెక్షన్ సెంటర్ హాల్‌లో శనివారం సాయంత్రం చాగంటి కోటేశ్వరరావుచే నిత్య పూజావిధానంపై ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. సృష్టిలో ప్రతి వస్తువు భగవంతుడి సృష్టి అని, అవి సన్మార్గంలో ఉపయోగిస్తే సత్‌ఫలితాలు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ పంచభూతాల సాక్షిగా నిత్య పూజా విధానాలు చేసి సన్మార్గం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి చాగంటి ప్రవచనాలు విని తరించారు.

ఎమ్మెల్యే విజయశ్రీకి సన్మానం



నాయుడుపేట టౌన్, జూలై 6 : సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీని పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం నెల్లూరు సీఎంఆర్ షాపింగ్ మాల్ అధినేత వాసు శాలువాకప్పి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, సుబ్బన్న, గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థులచే నగదు పురస్కారాలు



నాయుడుపేట, జూలై 6 : నాయుడుపేట బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు 1987-88 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు నగదు పురస్కారాలు శనివారం అందజేశారు. నెలవాయి ఆదర్శరెడ్డి 557 మార్కులతో పాఠశాల ప్రథమస్థానం రావడంతో రూ.5వేలు, నేదూరు భవ్యశ్రీ 537 ద్వితీయ బహుమతిగా రూ.3వేలు, ఎలుగంటి కౌసిక్ 536 మార్కులతో తృతీయ బహుమతిగా రూ.2వేలు ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. ఎంఈవో శాంతి, మునిరత్నం, హెచ్ఎం సురేష్, చంద్రశేఖర్, షఫీఉల్లా, పూర్వ విద్యార్థులు గోపీనాథ్‌రెడ్డి, రమేష్‌బాబు, సత్యనారాయణరెడ్డి, చిరంజీవి, రజనీబాబు, చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు.

వారాహి అమ్మవారికి పూజలు



గూడూరు అర్బన్, జూలై 6: స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గా దేవి ఉపపీఠంలో శనివారం వారాహి అమ్మవారి హోమ పూజలు నిర్వహించినట్లు నిర్వాహకుడు కోట సునీల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం నుంచి 15వ తేదీ వరకు వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, జూలై 6: కలవకొండలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయం త్రం స్వామి, అమ్మవార్లకు పల్లకీసేవ జరిపి ఆలయం సమీపంలో ఊరేగించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎమ్మెల్యే దాతృత్వం

గూడూరు అర్బన్, జూలై 6: స్థానిక 10వ వార్డులో సుబ్బయ్య అనే టీడీపీ కార్యకర్త అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. దీంతో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ దాతృత్వంతో రూ. 3వేలు ఆర్థికసాయాన్ని సుబ్బయ్య కుటుంబసభ్యులకు టీడీపీ నాయకురాలు భారతి, నాయకుడు సుధాకర్ అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ మృతి

తడ, జూలై 6 : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. చిత్తూరు జిల్లా గుడిపాల మండలం రామాపురం గ్రామానికి చెందిన కనకం జయచంద్ర (44) లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం నాయుడుపేటలో సరుకు రవాణాకోసం వచ్చి లోడ్ చేసుకొని చెన్నైవైపు బయలుదేరాడు. మార్గ మధ్యలో శుక్రవారం తెల్లవారుజామున పూడి గ్రామం వద్దకు వచ్చేసరికి లారీని ఆపి అక్కడ టీ తాగారు. ఈ సమయంలో క్లీనర్ జయచంద్ర లారీ వెనుక వైపు తనిఖీ చేస్తున్న సమయంలో లారీ డ్రైవర్ నాగరాజు వెనుక ఉన్న జయచంద్రను గమనించకుండా లారీని స్టార్ట్ చేసి వెనక్కుతీసుకురావడంతో జయచంద్రపై నుంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో క్లీనర్ జయచంద్ర తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందడంతో ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డక్కిలి మాజీ ఎంపీపీ మృతి


రోశయ్య నాయుడు (ఫైల్‌ఫొటో)

డక్కిలి, జూలై 6 : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, డక్కిలి మండలం పాతనాలపాడు గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ ఈతముక్కల రోశయ్య నాయుడు(72) అనారోగ్యంతో శనివారం తెల్లవారుజామున కన్ను మూశారు. ఈ సమాచారం తెలియగానే ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దిగ్ర్భాంతి చెందారు. ఆయన కుటుంబాన్ని పార్టీ అన్ని విధాలా ఆదుకుంటుందని చెప్పారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ రామచంద్రయ్య నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు పోలంరెడ్డి కొటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటరెడ్డి, జనసేన, బీజేపీ నాయకులు ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాల్సిందే

గూడూరు, జూలై 6: ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ పాపారావు అన్నారు. శనివారం టవర్‌క్లాక్ కేంద్రం వద్ద హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయాల్లో తలకు ఎటువంటి గాయాలు కాకుండా, ప్రాణాపాయ స్థితికి చేరుకోకుండా ఉండేందుకు హెల్మెట్ దోహదపడుతుందన్నారు కార్యక్రమంలో ఎస్ఐ శ్రీహరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రైస్‌మిల్లు తనిఖీ

సూళ్లూరుపేట, జూలై 6: పట్టణంలోని ప్రేమసాయి రైస్‌మిల్లును శనివారం తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ తనిఖీ చేశారు రైస్‌మిల్లులో ఉన్న ధాన్యం నిల్వలు, తయారీ చేస్తున్న బియ్యం బస్తాలను ఆయన తనిఖీ చేసి యాజమాన్యాన్ని వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ప్రభుత్వ నిబంధనలు తప్పకుండా రైస్‌మిల్లు యజమానులు పాటించాలని, లేనియెడల చర్యలు తీసుకొంటామన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

పెళ్లకూరు, జూలై 6 : సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని చెంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని చెంబేడులో వైద్యసిబ్బందితో కలసి ఇంటింటా సర్వేచేసి పాత టైర్లు, తొట్టెలు తదితర వస్తువులను పరిశీలించి నిల్వ ఉన్న నీటిని కింద పోయించి పరిసరాలను శుభ్రపరిచారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా కలుషిత నీరు, ఆహారం తీసుకోవద్దని సూచించారు. ప్రజలు అనారోగ్యానికి గురైతే తక్షణమే వైద్య సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

ఉపాధి పనులు చేయకనే బిల్లుల స్వాహా

- రూ.37,099 రికవరీకి, రూ.93,500 జరిమానా వసూళ్లకు ఆదేశాలు



సభలో రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ

వరదయ్యపాళెం, జూలై 6: ఉపాధి పనులను చేయకనే రికార్డులను సృష్టించి బిల్లులు స్వాహా చేశారు. సామాజిక తనిఖీల్లో అవకతవకలు వెలుగు చూడడంతో క్షేత్ర సహాయకురాలు, సాంకేతిక సహాయకురాలిని తొలగిస్తూ డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. వరదయ్యపాళెం మండలంలో 2022 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సభ ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రశేఖర్ అధ్యక్షతన శనివారం జరిగింది. పలు పంచాయతీల్లో సంతకాలు లేకనే చెల్లింపులు చేయడం, చేసిన పనుల్లో కొలతల వ్యత్యాసం, రికార్డులకు పొంతన లేకపోవడం, కూలీల వేతన గణనలో తేడాలు వంటి పలు అవకతవకలను గుర్తించారు. రూ.37,099 రికవరీతో పాటు సిబ్బంది నుంచి రూ.93,500 జరిమానా వసూలు చేసేలా డ్వామా పీడీ ఆదేశాలు జారీ చేశారు. అలాగే రాచర్లలో పూర్తి చేయని పక్కా ఇంటి నిర్మాణం పూర్తయినట్లు నమోదు చేసిన గృహనిర్మాణశాఖ ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ల నుంచి రూ.12వేల రికవరీకి ఆదేశించారు. పాందూరులో ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తల పేరుతో రికార్డులు నమోదు చేసి చేతివాటం ప్రదర్శించిన క్షేత్ర సహాయకురాలు లక్ష్మి, పనులను పర్యవేక్షించకుండా సంతకాలు చేసిన సాంకేతిక సహాయకురాలు లత సస్పెన్షన్‌కు పీడీ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమలో అంబుడ్స్‌మెన్ రాసరాయనాయుడు, డీఆర్‌డీఏ ఏపీడీ ప్రశాంతి, ఉపాధి ఏపీడీ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూములు... వైసీపీ సర్పంచ్ స్వాహా

- గతంలో తహసీల్దార్ నిర్వాకంతో పట్టాదారు పాసుబుక్కు మంజూరు
- లబోదిబోమంటున్న దళితులు



తహసీల్దార్ కార్యాలయం వద్ద వెలుగాజులపల్లి దళితులు

చిట్టమూరు, జూలై 7 : గతంలో ఓ తహసీల్దార్ చేసిన నిర్వాకం వల్ల తొమ్మిది మంది రైతులు వీధిన పడిన ఘటన చిట్టమూరు మండలంలో చోటు చేసుకుంది. తొమ్మిది మందితో జాయింట్ పట్టా ఉన్న దళితుల భూమిని స్థానిక సర్పంచ్ తన తల్లి సుజాతమ్మ పేరు మీద పట్టా చేయించుకుని వీధిన పడేశారు. తీరా అసలు విషయం తెలుసుకున్న రైతులు అవాక్కయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి... చిట్టమూరు మండలం ఎల్లూరు పంచాయతీ వెలుగాజులపల్లికి చెందిన తొమ్మిది మంది దళితులకు సర్వే నెంబర్ 163-2లో 3.83 ఎకరాల భూమిని 20ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం జాయింట్ పట్టా మంజూరు చేసింది. అప్పటినుంచి లబ్ధిదారులు పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ పార్టీ మద్దతుదారు సర్పంచ్‌గా ఎన్నిక కాబడిన సుమతి తన అధికార బలంతో అధికారులను గుప్పిట్లో పెట్టుకొని దళితుల పేరు మీదున్న జాయింట్ పట్టా భూమిని తన తల్లి పేరున పట్టా చేయించుకుని పాస్‌బుక్ చేయించుకుందని దళిత రైతులు ఆరోపించారు. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ తమ భూములను సర్పంచ్‌కు పట్టా చేశారని వాపోయారు. తమ భూములతో పాటు చెరువు కట్టను కూడా సర్పంచ్ కలిపేసుకున్నాడని ఆరోపించారు. గత ప్రభుత్వంలో అధికారులకు చెప్పుకున్నా తమ గోడు వినిపించుకోలేదని, పైగా పోలీసుల సమక్షంలో సర్పంచ్ తమ పొలంలో నాటిన వరి పైరును తొక్కించేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి పోలీసులు, రెవెన్యూ అధికారులు తమకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. నూతన ప్రభుత్వం స్పందించి సమగ్రంగా విచారించి తమకు న్యాయం చేయాలని శనివారం తహసీల్దార్ శ్రీనివాసశర్మకు వినతి పత్రం సమర్పించారు.

మంత్రుల దృష్టికి నియోజకవర్గాల సమస్యలు


మంత్రులతో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు

నెల్లూరు, జూలై6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లా సమగ్రాభివృద్ధికి సమష్టి కృషి చేయాలని జిల్లా టీడీపీ నేతలు నిర్ణయించుకున్నారు. మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిల నేతృత్వంలో శనివారం జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా అభివృద్ధి, అందుకు చేయాల్సిన కృషి అనే అంశంపై మంత్రులు, ఎమ్మెల్యేలు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమీక్షలో కలెక్టర్ ఆనంద్, జేసి సేథు మాధవన్ కూడా పాల్గొన్నారు. సమావేశంలో నియోజకవర్గాల వారీగా నెలకొన్న సమస్యలు, ప్రజల అవసరాలను ఎమ్మెల్యేలు మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను కలెక్టర్‌కు మంత్రులు వివరించి, సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సమన్వయంతో మంచి వాతావరణంలో జిల్లాను అభివృద్ధి చేయాలని తీర్మానించారు. ఈ సమావేశ వివరాలను మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ మీడియాకు వివరించారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి అవసరమైన అర్థవంతమైన చర్చ జరిగిందన్నారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే లక్ష్యంగా రాష్ట్ర పాలన ప్రారంభమైందని, సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారని వారు తెలిపారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అవకాశాలు, ఇదివరకే ఉన్న పరిశ్రమల్లో కల్పించాల్సిన మౌలిక వసతులపై ఎమ్మెల్యేలు కలెక్టర్, జేసీల దృష్టికి తీసుకొచ్చారని వివరించారు. త్వరలో జిల్లాకు జలవనరుల శాఖ మంత్రిని ఆహ్వానించి సాగునీటి ప్రాజెక్టులు త్వరిత గతిన పూర్తి చేయడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. నెల్లూరు, తిరుపతి జిల్లాల జీవనాడి అయిన సోమశిల ప్రాజెక్టును గత ఐదేళ్ల నుంచి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఆప్రాన్ కొట్టుకుపోవడంతో ప్రాజెక్టు మనుగడే ప్రశ్నార్థకం అయిందన్నారు. త్వరలోనే జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులను పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు. మంత్రి పొంగూరు నారాయణ నాయకత్వంలో జిల్లా పరిధిలోని ఎంపీలు,ఎమ్మెల్యేలంతా సమన్వయంతో సమష్టిగా జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధిని గాడిన పెట్టేందుకు చర్యలు చేపట్టామన్నారు. దగదర్తి ఎయిర్‌పోర్టు, దుగరాజపట్నం పోర్టు, కిసాన్ సెజ్, కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్‌లతోపాటు కొత్త పరిశ్రమల స్థాపనపై దృష్టి సారించామని వివరించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కాకర్ల సురేష్, కావ్య కృష్ణారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, నెలవల విజయశ్రీ, పాశం సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడలు ప్రారంభం

నాయుడుపేట, జూలై 6 : ఉమ్మడి నెల్లూరు జిల్లాస్థాయి 8వ తైక్వాండో క్రీడలు నాయుడుపేట షాదీమందిర్‌లో శనివారం ప్రారంభమయ్యాయి. క్రీడాకారులకు వెయిన్ పరీక్షలు నిర్వహించారు. రెఫరీలుగా ఉన్న 13 మందికి క్రీడా నియమనిబంధనలను ఏపీ తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ వేణుగోపాల్, ఉమ్మడి నెల్లూరుజిల్లా ప్రధాన కార్యదర్శి వి. శ్రీనివాసులు, కోశాధికారి వి. పవన్ కుమార్ తెలియజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్స్ కడపజిల్లా ప్రధాన కార్యదర్శి నాయబ్ రసూల్, అనంతపురం జిల్లా కార్యదర్శి పి. సాయి, కర్నూల్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ నజీర్, తదితరులు ఉన్నారు.

మంగళంపాడులో పారిశుధ్య పనులు

సూళ్లూరుపేట, జూలై 6: మండల పరిధిలోని మంగళంపాడులో అధికారులు పర్యటించి రోడ్డు పక్క, పరిసరాల్లో చెత్తను తొలిగించి బ్లీచింగ్ వేశారు. శనివారం ఆంధ్రజ్యోతిలో నిరుపయోగంగా సంపద కేంద్రాలు, రోడ్డుకు పక్కనే చెత్త అనే శీర్షికతో కథనం రావడంతో అధికారులు స్పందించారు. డీఎల్‌పీవో రవీంద్రకుమార్, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు ఆ గ్రామానికి వెళ్లి సర్పంచ్ రుక్మిణి ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తను జేసీబీ సాయంతో తొలిగించారు. డయేరియాపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. తడ మండలంలో కూడా డీఎల్‌పీవో వెళ్లి పారిశుధ్య పనులపై ఇన్‌చార్జి ఎంపీడీవో విజయకుమార్ ఆధ్వర్యంలో అన్ని ప్రాంతాల్లో బ్లీచింగ్ వేసి పరిసరాల శుభ్రత అవగాహన కల్పించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శిలు వేనాటి రాజారెడ్డి, గాబ్రేలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బీటీఏ సభ్యత్వాలు

కోట, జూలై6: మండల పరిధిలోని సిద్ధవరం, కర్లపూడి, గోవింద పల్లి, ఉత్తమనెల్లూరు గ్రామాల పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయులకు శనివారం బీటీఏ సభ్యత్వాలను బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకులు అందజేశారు. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులతో బీటీఏ సాధించిన విజయాలు, పోరాడిన ఉద్యమాలపై అవగాహన కల్పించారు. బహుజనుల పక్షాన నిలిచి అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యల కోసం పోరాటాలే శరణ్యమని బీటీఏ నాయకులు అన్నారు. కార్యక్రమంలో బీటీఏ మండల అధ్యక్షుడు నాగరాజు, మట్టిగుంటల శ్రీనివాసులు, బాబురావు, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, ఏడుకొండలు ఉన్నారు.

కోట కోర్టులో వేలంపాటలు


కోట, జూలై 6 : కోటలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం విరిగిపడిపోయిన చెట్లకు సంబంధించి వేలంపాటలు జరిగాయి. న్యాయమూర్తి భరత్‌కమల్ ఆధ్వర్యంలో పలు మండలాలకు చెందిన వ్యాపారులు ఈ వేలంపాటల్లో పాల్గొన్నారు. గతంలో వచ్చిన మీచౌంగ్ తుఫాన్ కారణంగా కోట కోర్టు ప్రాంగణంలో ఉన్న చెట్లు అన్ని పడిపోయాయి. ఆయా చెట్లను నరికి తరలించుకునేందుకు వేలంపాటలు నిర్వహించారు. రూ.77,500లకు కోట మండలం తిన్నెలపూడికి చెందిన పురిణి శ్రీనివాసులు పాటలో దక్కించుకున్నారు.

టీడీపీ నేత కుటుంబానికి ఆర్థిక సాయం

కోట, జూలై 6 : కోట దళితవాడలో టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు స్వర్గీయ మర్రి గున్నయ్య కుటుంబానికి శనివారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ రూ20 వేల ఆర్థిక సాయం చేశారు. రెండేళ్లక్రితం మర్రి గున్నయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన తల్లిదండ్రులకు ఎంపీటీసీ దారా సురేష్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు మర్రి అనిల్ చేతులమీదుగా రూ.20 వేలు అందజేశారు.

లెక్కల టీచర్‌పై చర్యలు తీసుకోండి

ఎస్వీయూ రిజిస్ట్రార్‌కు టీఎన్ఎస్ఎఫ్ విజ్ఞప్తి


రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 6: ఏకకాలంలో రెండు వేతనాలు పొందిన లెక్కల మాస్టారు సురేష్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ కోరింది. టీఎన్ఎస్ఎఫ్ నాయకుల బృందం శనివారం వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ చంద్రయ్యను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్కే నాయుడు మాట్లాడుతూ.. యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న క్యాంపస్ స్కూల్లో టైం స్కేల్ ఉద్యోగిగా ఉంటూనే, తిరుపతి ఎమ్మెల్యే కరుణాకర రెడ్డికి ఓఎస్డీగా పనిచేస్తూ రెండు వైపులా వేతనం పొందిన సురేష్‌రెడ్డిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.

- అలాగే, హైదరాబాదు జేఎన్‌టీయూ నుంచీ డిప్యుటేషన్‌పై ఎస్వీయూకు వచ్చిన ప్రొఫెసర్ అపర్ణపైనా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ అంశానికి పాలకమండలి ఆమోదం కూడా లేకపోవడం చట్ట విరుద్ధమని వారు పేర్కొన్నారు.భీష్మ, బషీర్, ఆంజనేయులు, రంగన్న, మల్లి తదితరులు పాల్గొన్నారు.

హంతకులను వెంటనే అరెస్టు చేయాలి

కోట, జూలై 6 : తమిళనాడు రాష్ట్ర బహుజన సమాజ్‌పార్టీ అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని బీఎస్పీ, బహుజన ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. కోట క్రాస్‌రోడ్డులో శనివారం బీఎస్పీ, బహుజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యకు నిరసన చేపట్టారు. నిందితులను బహిరంగంగా ఉరితీయాలంటూ నినాదాలు చేశారు. ఒక జాతీయపార్టీ నాయకుడిని పైశాచికంగా హత్యచేస్తే ఇప్పటివరకు నిందితులను అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు ఊపిరిపోస్తామన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ సీనియర్ నాయకులు మీజూరుమాధవ్, కేశవులు, బహుజన ఐక్యవేదిక నాయకులు రంగనాథ్, అశోక్‌కాంబ్లే, సుందరం, పోలయ్య ఉన్నారు.

ఎక్స్‌కవేటర్ ఢీకొని ఇంటర్ విద్యార్థి దుర్మరణం


ప్రణయ్(ఫైల్)

ఓజిలి, జూలై 6: ఓజిలి మండలం పాపిరెడ్డి కండ్రిగ సమీపంలో ఎక్స్‌కవేటర్ ఢీకొని ఇంటర్ విద్యార్థి ప్రణయ్(18)మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు... పాపిరెడ్డికండ్రిగ గ్రామానికి చెందిన ప్రణయ్ నాయుడుపేటలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. శనివారం సాయంత్రం ప్రణయ్ గ్రామ సమీపంలో రోడ్డు పక్కన నడిచి వస్తుండగా ఎక్స్‌కవేటర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని హుటాహుటిన నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే ప్రణయ్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెల్మెట్ విధిగా ధరించాలి

కోట, జూలై6 : హెల్మెట్‌ను విధిగా ధరించి ప్రాణాపాయం నుంచి బయటపడాలని ఎస్ఐ నాగబాబు కోరారు. మండల పరిధిలోని చిట్టేడు, విద్యానగర్, కోట క్రాస్‌రోడ్డులలో శనివారం హెల్మెట్ ధారణపై వాహన చోదకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ద్విచక్రవాహనాలలో ప్రయాణించేటప్పుడు ప్రతిఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధరించకపోతే రోడ్డు ప్రమాదాల బారిన పడుతామన్నారు. అనంతరం హెల్మెట్ ధారణపై ప్రయోగాత్మకంగా వాహనచోదకులకు అవగాహన కల్పించారు.

అభివృద్ధికి నోచుకోని వాటర్ ట్యాంకులు


శిథిలావస్థలో వాలాయనందపురం, విఘ్నేశ్వరపురం ట్యాంకులు

గూడూరు, జూలై 6: పట్టణంలో ప్రజలకు తాగునీరు అందించే పలు ఓవర్‌హెడ్ ట్యాంకుల మెట్లు కూలిపోయి దుస్థితికి చేరుకున్నాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో పలు ట్యాంకులు శుభ్రపరిచిన దాఖలు లేకుండా పోయాయయని ప్రజలు వాపోతున్నారు. గూడూరు పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు కండలేరు నుంచి వేములపాళెం వాటర్‌వర్క్స్‌కు నీటిని తరలించి అక్కడ క్లోరినేషన్ చేసిన అనంతరం పట్టణంలో నిర్మించి ఉన్న పది ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీటిని సరఫరా చేస్తారు. ఈ ఓవర్‌హెడ్ ట్యాంకుల నుంచి ప్రజలకు తాగునీటిని పైపులైన్ల ద్వారా అందిస్తుంటారు. ప్రతి మూడు నెలలకు ఒక్కసారి ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రపరుస్తారు. పట్టణంలోని పలు నీళ్లట్యాంకులకు నిర్మించిన మెట్లు కూలిపోయి ఉన్నాయి. దీంతో ఐదేళ్లుగా పలు నీళ్లట్యాంకులను శుభ్రపరచడం కానీ, క్లోరినేషన్ చేయడం కానీ జరగడంలేదని ప్రజలు అంటున్నారు. స్థానిక వాలాయనందపురంలో నీళ్లట్యాంకు 8లక్షల లీటర్ల సామర్థ్యం, జనార్దన్‌రెడ్డికాలనీలోని నీళ్లట్యాంకు 5లక్షల లీటర్ల సామర్థ్యం, విఘ్నేశ్వరపురంలోని నీళ్లట్యాంకు 4లక్షల లీటర్ల సామర్థ్యం కలిగివున్నాయి. ఈ మూడు వాటర్ ట్యాంకులకు ఎక్కే మెట్లు కూలిపోయి దుస్థితిలో ఉన్నాయి. అదేవిధంగా జానకిరామ్‌పేటలో 7.50లక్షలు, 2.25లక్షల లీటర్ల సామర్థ్యంతో రెండు నీళ్లట్యాంకులు పక్కపక్కనే ఉన్నాయి. వీటిని శుభ్రపరిచేందుకు మెట్లు బాగున్నా ట్యాంకుకు వెళ్లే ఉమ్మడి ప్లాట్‌ఫాం దెబ్బతినివుంది. వీటి కారణంగా ట్యాంకులను శుభ్రపరచడం లేదని ప్రజలు అంటున్నారు. నిచ్చెన సాయంతోనైనా ట్యాంకులను అప్పుడప్పుడు శుభ్రపరిచి ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన గత పాలకులు అసలు పట్టించుకోలేదని ప్రజలు చెబుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాగునీటి సమస్యను పరిష్కరించేలా, నాణ్యమైన నీటిని సరఫరా చేసేలా ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పటిష్ట చర్యలు చేపట్టారు. గతనెలలో తాగునీటి సరఫరా వనరులను స్వయంగా పరిశీలించి దెబ్బతిన్న నీళ్లట్యాంకులను అభివృద్ధిపరిచేలా ప్రణాళికలను రూపొందించాలని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలిచ్చారు. దీంతో ఎమ్మెల్యే చొరవతోనైనా దెబ్బతిన నీళ్లట్యాంకులు అభివృద్ధి చెందుతాయని పట్టణ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.